PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 6 | విజయవాడ, మంగళవారం 6 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 6 August 2024 | Rs

విద్యుత్ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించండి

- ఏపిసిపిడిసిఎల్ సిఎమ్‌డికి వినతి

3



3

నాగార్జున సాగర్ గేట్లు ఎత్తివేత

- 16 గేట్ల ద్వారా 1.13 లక్షల క్యూసెక్కులు విడుదల

మెరుగైన పాలనే లక్ష్యం

- 4 'పి'లతో ముందుకు
- మానవతా దృక్పథంతో పని చేయాలి
- ఆర్థిక సంస్కరణలతో గతంలో వృద్ధి
- అక్టోబర్ 2న విజన్ డాక్యుమెంట్
- కలెక్టర్లకు చంద్రబాబు దిశా నిర్దేశం



కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారుల సదస్సులో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న రోజుల్లో నాలుగు 'పి'లతో ముందుకు వెళ్లాలని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సమావేశం సోమవారం జరిగింది. అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సదస్సును ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వివిధ అంశాలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. సదస్సు ప్రారంభం నుండి చివరి వరకు సమావేశంలోనే ఉన్న ఆయన వివిధ సందర్భాల్లో కూడా జోక్యం చేసుకుని మాట్లాడారు. సదస్సు ప్రారంభంలో గతంలో తమ ప్రభుత్వం అనుసరించిన విధానాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్తులో ప్రాధాన్యతలను, పాలన సాగే తీరును కలెక్టర్లకు వివరించారు. గతంలో అమలు చేసిన పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్ విధానాన్ని ప్రస్తావించిన ఆయన, ఆ విధానంతో మంచి అభివృద్ధిని సాధించామని చెప్పారు. ప్రస్తుతం పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్ (నాలుగు 'పి'లు) విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్లు ఈ విధానాన్ని అమలు చేస్తూ ముందుకు వెళ్లాలని, మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం ద్వారా గతంలో మంచి పలితాలు సాధించినట్లు చెప్పారు. 'రాష్ట్రంలో కాంపిటేటివ్ గ్రోత్ వచ్చింది' అని చెప్పారు. ఇప్పుడు కూడా మెరుగైన పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అక్టోబర్ రెండవ తేదీన విజన్ డాక్యుమెంట్ విడుదల చేయనున్నట్లు తెలిపారు.

కలెక్టర్లు అదే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కొన్ని కీలకశాఖలు అభివృద్ధికి, ఆదాయానికి దోహదం చేస్తాయని, ఆదాయం వస్తేనే ప్రజలకు ఖర్చు చేయగలగుతామని పేర్కొన్నారు, దీనిని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని, టూరిజానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం తోపాటు ఆదాయం కూడా రాబట్టుకోవచ్చని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించాలని అన్నారు. తాను కూడా అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్తానని చెప్పారు. 'అంగన్‌వాడీ సెంటర్లను స్వయంగా పరిశీలిస్తా... డ్రెయిన్లను కూడా చూస్తా' అని అన్నారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం జరగడం ద్వారానే ఆర్థిక పరిపుష్టి వస్తుందని వివరించారు

జీరో పావర్టీ ...వికసిత ఆంధ్ర

కలెక్టర్లు మానవతా దృక్పథంతో ఆలోచిస్తే చాలా వరకూ సమస్యలు పరిష్కారం చేయొచ్చని, ఇక ముందు అటువంటి ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని చెప్పారు. జీరో పావర్టీ, వికసిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అధికారులు ఈ దిశలో పని చేయాలని సూచించారు. ప్రభుత్వంలో ఎవరూ పెత్తందారీ వ్యవస్థలా ప్రవర్తించకూడదని, అసహ్యంగా మాట్లాడకూడదని, అవవసరంగా దూషించవద్దని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చూడాలని తెలిపారు. ఈజ్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ రావాలని కోరారు. ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాన్ని అధికారులూ తిప్పికొట్టాలని, సోషల్ మీడియా ఎకౌంట్ల ద్వారా మంచిని చెప్పాలని సూచించారు. 1995 నుండి తాను విధిగా కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెడుతున్నానని చెప్పారు. రాబోయే కాలంలో మూడునెలలకు ఒకసారి సమావేశం ఉంటుందని తెలిపారు.

ఐదేళ్ల విధ్వంస పాలన

జగన్ అధికారంలోకి వచ్చాక అన్ని మిగతా 2లో

ఐఎఎస్, ఐపిఎస్‌లకు సంపూర్ణ స్వేచ్ఛ : పవన్ కల్యాణ్

ఐఎఎస్, ఐపిఎస్‌లకు తమ పాలనలో సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్నికల ముందు ఎన్నో అవమానాలు భరించామని, వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులనూ గత ప్రభుత్వం అవమానించిందని తెలిపారు. వ్యవస్థల బలోపేతం చేయడం కోసం దెబ్బతిన్నామని, భరించామని చెప్పారు. తాను రాష్ట్రంలోకి రావాలన్నా అడ్డుకున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో ఎపిలో పనిచేసేందుకు ఐఎఎస్, ఐపిఎస్‌లు భయపడిపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, పాలన ఛిద్రం చేశారని వివరించారు. ఐఎఎస్, ఐపిఎస్‌లు ఆటబొమ్మలయ్యారని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడటానికి సిద్ధంగా ఉన్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలనాదక్షత, అనుభవం, దార్శనికత నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఆయన విజన్ కోసం తాము కష్టపడతామని వివరించారు. ప్రభుత్వం తరుపు తప్పులు ఉంటే అధికారులు తెలపాలని, స్కిల్ సెన్సస్‌కు సలహాలు, సూచనలు అవసరమని వివరించారు. జవాబుదారీతనంతో కూడుకున్న ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. ఈ సమావేశాన్ని సిసిఎల్ఎ జయలక్ష్మి ప్రారంభించారు. తొలుత సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాదు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. ప్లానింగ్ విభాగం ముఖ్యకార్యదర్శి పియూష్‌కుమార్ విజన్ ఆంధ్ర 2047 డాక్యుమెంటును వివరించారు.

మరిన్ని వార్తలు 2లో



ఆర్మీ చేతికి పగ్గాలు

చిట్టగాంగ్‌లో ఆందోళనకారులు



బంగ్లా ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్



షేక్ హసీనా

బంగ్లాదేశ్ ప్రధాని హసీనా రాజీనామా

- సోదరితో కలిసి భారత్‌కు
- త్వరలో తాత్కాలిక ప్రభుత్వం: ఆర్మీ చీఫ్
- విద్యార్థి, ఉపాధ్యాయుల ప్రతినిధులతో చర్చలు
- గానో భవనంలో విధ్వంసం సృష్టించిన ఆందోళనకారులు

ఢాకా: బంగ్లా దేశ్ రాజకీయాలు అనూహ్యమైన మలుపుతిరిగాయి రెండో దశ ఆందోళనల్లో పెద్దయెత్తున హింస చెలరేగడం, ఢాకా మార్చ్‌కు ఆందోళనకారులు పిలుపునివ్వడంతో ప్రధాని షేక్ హసీనా సోమవారం మధ్యాహ్నం రాజీనామా చేశారు. ఆ వెంటనే తన సోదరి రెహానాతో కలిసి ఆమె సైనిక హెలికాప్టర్‌లో దేశం వీడి వెళ్లిపోయారు. భారత్‌లోని ఘజియాబాద్ (యుపి)లో హిండన్ ఎయిర్ బేస్‌లో దిగిన వెంటనే భారత్ ప్రభుత్వ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను కలుసుకున్నారు. బంగ్లాదేశ్‌లో తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ భద్రతా కేబినెట్ అత్యవసర సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.

బంగ్లా ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్ సోమవారం సాయంత్రం జాతినుద్దేశించి టీవిలో ప్రసంగిస్తూ, తాత్కాలిక జాతీయ ఐక్యతా ప్రభుత్వ ఏర్పాటుకు యత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థులు, యూనివర్సిటీ అధ్యాపకుల ప్రతినిధులతోను, వివిధ రాజకీయ పార్టీలతోను ఆర్మీ చీఫ్ చర్చలు, సంప్రదింపులు ప్రారంభించారు. దేశంలో స్తంభించిపోయిన 4 జి సేవలు, బ్రాడ్ కాస్టింగ్ సర్వీసులను పునరుద్ధరించినప్పటికీ సోషల్ మీడియాపై నిషేధం అలానే ఉంది. హసీనా నిష్క్రమణ తరువాత ప్రధాని అధికారక నివాసం (గానో భవన్) లోకి ఆందోళనకారులు చొరబడి లూటీలు, విధ్వంసానికి పాల్పడ్డారు. ఢాకాలోని బంగ బంధు ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని సుత్తితో కొట్టి పగలగొట్టారు. బంగ్లా హోం మంత్రి ఇంటిపైన, అలాగే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నివాసంపైన దాడి చేసి కార్లను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఢాకాలోని అవామీ లీగ్ పార్టీకి చెందిన నాయకుని హోటల్‌కు నిప్పంటించడంతో 8 మంది సజీవ దహనమయ్యారు. అధికార పార్టీకి చెందిన వివిధ కార్యాలయాలకు నిప్పు పెట్టారు. లూటీలు, విధ్వంసం వంటివి ఆపాలని విశ్వవిద్యాలయ అధ్యాపకులు ఆందోళనకారులకు విజ్ఞప్తి చేశారు. ఢాకా విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల నుంచి మూసివేశారు. భారత్- బంగ్లా మధ్య రైళ్ల సర్వీసులను నిలిపేశారు. ఇమిగ్రేషన్ చెక్‌పోస్టను నిరవధికంగా మూసివేశారు. సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు నిత్యావసర సరఫరాలు ఆగిపోయాయి. మరో వైపు భద్రతా దళాల నిరంతర నిఘాతో అక్కడి ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

మరిన్ని వార్తలు 7లో

తాజా పరిణామాల వెనక అమెరికా హస్తం

దేశంలో తీవ్ర అస్థిరతకు దారి తీసిన తాజా పరిణామాల వెనక అమెరికా హస్తం ఉందని బంగ్లాదేశ్ వర్కర్స్ పార్టీ అధ్యక్షుడు రషీద్ ఖాన్ మీనన్ అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికల తరువాత అమెరికా ప్రతిపాదించిన నమూనాను బంగ్లాదేశ్‌లోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, జమాతే, ప్రతిపక్ష బంగ్లా నేషనల్ పార్టీ (బిఎన్‌పి) అమలు చేశాయి. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల వెనుక వారు ఉన్నారని ఆయన అన్నారు.

-బంగ్లాదేశ్ వర్కర్స్ పార్టీ నేత మీనన్

అక్రమ తొలగింపులు, వేధింపులపై నిరసనాగ్రహం

- రాష్ట్రవ్యాప్తంగా కదంతొక్కిన స్కీమ్ వర్కర్లు
- ర్యాలీలు, కలెక్టరేట్ల వద్ద ధర్నా
- తీరు మారకపోతే ఉద్యమం ఉధృతం : సిఐటియు



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- యంత్రాంగం

అక్రమ తొలగింపులపై స్కీమ్ వర్కర్లు నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం కదంతొక్కారు. సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీలు, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశాలు, అంగన్‌వాడీలు, విఒఎలు, యానిమేటర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, గ్రీన్ అంబాసిడర్లు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కక్ష సాధింపు చర్యలు, తొలగింపులు, బెదిరింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజకీయ వేధింపులకు తాము వ్యతిరేకమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నాయకులు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నంద్యాలలో నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి కలెక్టరేట్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, ఐసిడిఎస్ పిడి నిర్మల, ఉప విద్యాశాఖ అధికారి ఎంఎ బేగ్, డిపిఒ మంజులవాణి, డ్వామా ఎపిడి, ఇన్‌ఛార్జి డిఎం అండ్ హెచ్ఒ తదితర శాఖల అధికారులు నిరసన కార్యక్రమం వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరినీ తొలగించబోమని హామీ ఇచ్చారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా అనంతరం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు.

బాపట్ల కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ మాట్లాడుతూ స్కీం వర్కర్ల పట్ల రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మిగతా 7లో

డెత్ చాంబర్లుగా కోచింగ్ సెంటర్లు

- ఢిల్లీలో మరణాలపై సుప్రీం

న్యూఢిల్లీ : ఢిల్లీ కోచింగ్ సెంటర్‌లో సంభవించిన మరణాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీలో భారీగా కురిసిన వర్షాలకు రాజిందర్ నగర్‌లోని రావూస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు పోటెత్తి సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతున్న ముగ్గురు విద్యార్థులు మరణించిన సంఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు, కోచింగ్ సెంటర్లు డెత్ చాంబర్లుగా మారాయని వ్యాఖ్యానించింది. 'ఇప్పటివరకు ఢిల్లీ ప్రభుత్వం లేదా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నాయో మాకు తెలియడం లేదు. భవిష్యత్తు కోసం కోచింగ్ సెంటర్లలో చేరిన యువత ప్రాణాలు తీసిన దురదృష్టకరమైన సంఘటనలు అందరి కళ్లను తెరిపించాయని' జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. కేంద్రానికి, ఢిల్లీ పట్టణాభివృద్ధి శాఖకు నోటీసులు జారీ చేసింది. ఇలాంటి మరణాలను నివారించేందుకు తీసుకున్న భద్రతా చర్యలేమిటో తెలియజేయాల్సిందిగా అధికారులను ఆదేశించింది. దేశం నలుమూలల నుండి చదువుకునేందుకు ఇక్కడకు వస్తారు, అలాంటివారు ఇక్కడ ప్రాణాలు కోల్పోవాలా? అని జస్టిస్ కాంత్ ప్రశ్నించారు.

బిఎస్‌ఎన్‌ఎల్‌కు కొత్తగా 27.5 లక్షల ఖాతాదార్లు

న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కోలు భారీగా టారిఫ్‌లను పెంచడంతో 27.5 లక్షల మంది ఖాతాదారులు బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌ను ఇటీవల కాలంలో ఎంచుకుంటున్నారు. జులై తొలి వారంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు తమ ఖాతాదారులపై ఏకంగా 25 శాతం మేర చార్జీలను పెంచాయి. భారం పెరగడంతో చౌక ధరల్లో మెరుగైన ప్లాన్లను అందిస్తున్న ప్రభుత్వ టెల్కో బిఎస్‌ఎన్‌ఎల్‌కు మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పి) పెట్టుకుంటున్నారు. "ప్రభుత్వ టెల్కో బిఎస్‌ఎన్‌ఎల్ చందాదారుల సంఖ్య పెరుగుతోంది. 4జి నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నాం. 5జి సేవలకు మారడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం. 2025 నాటికి 4జి నెట్‌వర్క్‌కు చెందిన లక్ష టవర్లు ఇన్‌స్టాల్ చేస్తాం " అని ఐటి, టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 4జి టవర్ల ఏర్పాటు కోసం తేజస్ నెట్‌వర్క్, సి డాట్, టిసిఎస్ తదితర సంస్థలతో బిఎస్‌ఎన్‌ఎల్ ఒప్పందం కుదుర్చుకుని పనిచేస్తోంది. 2024 అక్టోబర్ నాటికి 80000 టవర్లు, వచ్చే ఏడాది మార్చి నాటికి 21000 టవర్లను ఇన్‌స్టాల్ చేయాలని నిర్దేశించుకుందని మంత్రి సింధియా తెలిపారు.

ఏలూరు జిల్లాలో ఘోరం

చిన్నారిపై ఆగంతకుని లైంగిక దాడి

ప్రజాశక్తి- నూజివీడు టౌన్

ఏలూరు జిల్లా నూజివీడు మండలం పల్లెర్లమూడిలో నాలుగు సంవత్సరాల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. కుటుంబంతో కలిసి ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తున్న చిన్నారిని ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడడం అందరినీ కలిచి వేసింది. ఇందకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... పల్లెర్లమూడిలో ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన ఒక కుటుంబ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ఇంటి ఆరు బయట నిద్రిస్తున్న తాత, నానమ్మతో కలిసి చిన్నారి ఆదివారం రాత్రి పడుకుంది. తల్లిదండ్రులు, మరో ఇద్దరు పిల్లలు ఇంటి లోపల నిద్రించారు. అంతా ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో ఆగంతకుడు ఇంటి గోడపై ఉంచిన బాలిక తండ్రి సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. అనంతరం ఆరు బయట నిద్రిస్తున్న చిన్నారిని అపహరించి సమీపంలోని పామాయిల్ తోటలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్పృహ కోల్పోయిన చిన్నారి పట్టీలను సైతం అపహరించి అక్కడ నుంచి పరారయ్యాడు. బాలికకు స్పృహ వచ్చాక తోటలోనుంచి రోడ్డుపైకి వచ్చింది. అదే సమయంలో సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పొలం వద్దకు వెళ్తున్న ఆ ఊరి పెద్ద... ఆ బాలికను చూసి ఆరా తీయడంతో తన తల్లిదండ్రుల పేర్లు చెప్పింది. వెంటనే ఆయన సమీపంలోని గ్రామస్తులకు, ఆ చిన్నారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారిచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నారిని నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. నూజివీడు ఆర్‌డిఒ భవానీ శంకరి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో చిన్నారి తీవ్ర భయాందోళనతో ఉంది.

అఘాయిత్యానికి పాల్పడిన ఆగంతకుడిని గుర్తించి శిక్షించండి : మంత్రి పార్థసారథి

చిన్నారిపై లైంగిక దాడి పట్ల రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అఘాయిత్యానికి పాల్పడిన ఆంగతకుడిని గుర్తించి తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా యంత్రాంగాన్ని, పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అవసరమైతే జాగిలాలను రంగంలోకి దించాలని సూచించారు.

కెటిపిఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత

- ఆధునిక టెక్నాలజీతో నేలమట్టం

లోపలి పేజీలో..

'రాజ్యాంగ ప్రవేశిక' తొలగింపు

- 3, 6 తరగతుల పాఠ్య పుస్తకాలపై ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయం
- కేంద్ర ప్రభుత్వంపై విద్యావేత్తల ఆగ్రహం

'బేర్'మన్న మార్కెట్లు

రూ.15 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 2200 పాయింట్ల పతనం

ముంబయి : అమెరికాలో ఆర్థిక మందగమనం భయాలు ప్రపంచ మార్కెట్లను బెంబేలెత్తించాయి. ఈ క్రమంలోనే సోమవారం భారత మార్కెట్లు భారీ నష్టాల పాలయ్యాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 2222 పాయింట్లు లేదా 2.74 శాతం పతనమై 78,768కు దిగజారింది. ఇంట్రాడేలో ఏకంగా 78,296 పాయింట్లు లేదా 3 శాతం విలువ కోల్పోయింది. ఒక్క పూటలోనే రూ.15.34 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. దీంతో బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.457 లక్షల కోట్ల నుంచి రూ.441.82 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో దలాల్ స్ట్రీట్‌లో ఒక్కసారిగా ఏర్పడిన కుదుపునతో సాధారణ మదుపర్లు బోరుమన్నారు. బిఎస్ఇలో బాటలోనే ఎన్ఎస్ఇ నిఫ్టీ 662 పాయింట్లు లేదా 2.68 శాతం పతనమై 24,055 వద్ద ముగిసింది. నిఫ్టీ-50లో 45 స్టాక్స్ నష్టాలను చవి చూశాయి. టాటా మోటార్స్, ఒఎన్‌జిసి, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, హిందాల్కో షేర్లు అత్యధికంగా 7 శాతం వరకు పతనమయ్యాయి. బిఎస్ఇ-30లో హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే మినహా 28 స్టాక్స్ నేల చూపులు చూశాయి. నిఫ్టీలో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 4.5 శాతం, 3.5 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఆటో, లోహ, ఐటి, బ్యాంకింగ్ సూచీలు అత్యధికంగా 4.85 శాతం వరకు క్షీణించాయి. అమెరికా మాంద్యంలోకి జారుకుంటుందని, ఉపాధి పడిపోతుందనే విశ్లేషణలు, సంకేతాలు ప్రపంచ మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. ఈ ఏడాది జులై నెలలో వ్యవసాయేతర రంగాల్లో 1.14 లక్షల ఉద్యోగాలే వచ్చాయని అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ గణాంకాలు వెల్లడించాయి.

నిరుద్యోగిత రేటు 4.3 శాతానికి పెరగడం ప్రపంచ మార్కెట్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. మార్కెట్ల పతనానికి ఇదే ప్రధాన కారణం. దీంతో పాటు బ్యాంక్ ఆఫ్ జపాన్ ఇటీవల వడ్డీరేట్లను 0.25 శాతం పెంచడం, బాండ్ల కొనుగోళ్లను తగ్గించడంతో అక్కడి నికాయ్ సూచీ 14 శాతం పడిపోవడం.. ఇతర ఆసియన్ మార్కెట్లపై ప్రభావం చూపింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయవచ్చని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ సంకేతాలు ఇవ్వడం ప్రపంచ మార్కెట్లను మరింత కలవరానికి గురి చేశాయి.

భూముల రీ సర్వేపై గ్రామ సదస్సులు

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



భూముల రీ సర్వేను కొనసాగించినా, నిలుపుదల చేసినా సమస్యలెన్నో ఎదురవుతున్నాయని, ఈ విషయంలో గ్రామ సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు కృషి చేయాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 77 లక్షల సరిహద్దు రాళ్లు ఉన్నాయని, వాటిని కూడా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు, వైఎస్‌ఆర్, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) భూములు రిజిస్ట్రేషన్లు (గిఫ్ట్, సేల్) ఎక్కువగా జరిగాయని, వీటిపై పున:పరిశీలన చేయాలని సూచించారు. నిషేధిత జాబితా (22ఎ) నుంచి అసైన్డ్, చుక్కలు, ఇనామ్, సర్వీస్, షరతుల గల పట్టాలు తొలగించిన తీరును కూడా పరిశీలించాలన్నారు. భూముల కన్వర్షన్‌లో నిబంధనల అమలు బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలన్నారు. భూ సమస్యలపై వచ్చే అర్జీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కులగణన నిర్వహించాలని, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.

అడవుల విస్తీర్ణం పెంపునకు చర్యలు

- అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరామ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అడవుల విస్తీర్ణం పెంపు దిశగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరామ్ సూచించారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో అడవుల విస్తీర్ణం పెంచాల్సిన అవశ్యకతను సోమవారం ఆయన వివరించారు. గ్రామీణ హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం గత నాలుగేళ్లలో రాష్ట్రంలో జరగలేదన్నారు. ఇప్పుడు మళ్లీ మొక్కలు నాటే కార్యక్రమం పెద్దయెత్తున నిర్వహించాలని చెప్పారు. వనం-మనం, నీరు-చెట్టు, వనం పిలుస్తోంది వంటి కార్యక్రమాలు పెద్దయెత్తున చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో హరితఛత్రం(గ్రీన్ కవర్) విస్తరించడానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అడవులు పెంచే చర్యల్లో భాగంగా రూ.13.5 కోట్లతో విత్తనాలు వెదజల్లే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో 50 లక్షల విత్తనాల సీడింగ్ పనులు చేపట్టే కార్యక్రమాలను కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు 22,776

- డిఎస్‌సితో 16,347 భర్తీ


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 22,776 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. సచివాలయంలో సోమవారం కలెక్టర్ల సదస్సులో పాఠశాల విద్య వివరాలను ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్ పవరపాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మొత్తం 44,407 ప్రభుత్వ పాఠశాలల్లో మంజూరు పోస్టులు 1,78,778 ఉన్నాయని తెలిపారు. వీటిల్లో 22,776 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే 16,347 పోస్టులు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో మొత్తం 61,511 పాఠశాలలు ఉండగా, వీటిల్లో 44,407 ప్రభుత్వ, 940 ఎయిడెడ్, 13,359 ప్రైవేట్ ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య 10 లోపు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 4,992, 20 లోపు 12,252 ఉన్నాయని తెలిపారు. 44,110 ప్రభుత్వ పాఠశాలల్లో 33,81,061 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకుంటున్నారు. 1,759 పాఠశాలల్లో నాడు-నేడు పనులు పూర్తవ్వగా, 20,552 పాఠశాలల్లో జరుగుతున్నాయి. తల్లిదండ్రుల కమిటీల ఖాతాల్లో నాడు-నేడు నగదు రూ.274 కోట్లు ఉంది.

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు జిల్లాకో జెసి

- రేషన్ షాపులకు రాలేని వారికి ఇళ్లకు వెళ్లి ఇవ్వాలి
- కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ద్రవ్యోల్బణాన్ని తగ్గిస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని, అందుకోసం జిల్లాల్లో ఇంకో జాయింట్ కలెక్టరును రెవెన్యూ పర్యవేక్షణకు నియమించాలని కలెక్టర్లకు సిఎం చంద్రబాబు ఆదేశించారు. పౌరసరఫరాల శాఖపై సచివాలయంలో జిల్లాల కలెక్టర్లతో సోమవారం జరిపిన సమీక్షా సమావేశంలో సిఎం మాట్లాడారు. రేషన్ షాపుల్లో ప్రజలకు నచ్చిన విధంగా మాత్రమే రాగులు, సజ్జలు, ఇతర మిల్లెట్స్ విక్రయించాలన్నారు. చిరుధాన్యాలకు రానున్న రోజుల్లో మంచి డిమాండ్ ఉంటుందని, వాటిని ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ అంటూ వాహనాలను తీసుకొచ్చి రూ.2 వేల కోట్లు ఖర్చు చేయడంతోపాటు రేషన్ పంపిణీ చేయడానికి 15 రోజుల పాటు ఇద్దరిని నియమించి వారికి కూడా జీతం ఇచ్చారన్నారు. రేషన్ దుకాణాలకు రాలేని వారికి ఇంటింటికీ వెళ్లి సరుకులు ఇవ్వాలని, ఈ రేషన్ వాహనాలను ప్రవేశపెట్టిన తర్వాత రైస్ తీసుకొచ్చే వాహనం వచ్చే వరకు రోడ్లపై నిలబడాల్సి వస్తుందని సిఎం వెల్లడించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుకు 48 గంటల్లో డబ్బులు చెల్లించాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని ఇష్టమొచ్చిన రైస్ మిల్లింగ్‌కు తీసుకెళ్లడానికి వీల్లేదని, ఎక్కడ పండించిన ధాన్యాన్ని అక్కడే దగ్గర్లోని రైస్ మిల్‌కు తీసుకొచ్చే వెసులుబాటు కల్పించాలన్నారు. ఇదే అంశంపై పౌరసరఫరాలశాఖ కమిషనరు సిద్ధార్థజైన్ మాట్లాడుతూ.. జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరలను నియంత్రణలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు, ఇందుకు ఆయా జిల్లాల కలెక్టర్ల సహకారం అవసరమని తెలిపారు. పౌరసరఫరాలశాఖ ఇన్ఫార్మ్, రీ ఫార్మ్, పెర్ఫార్మ్ విధానంలో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న 6 వేల చౌకధరల దుకాణాలను త్వరలో భర్తీ చేయనునట్లు వెల్లడించారు. పేదలకు అందించే నిత్యావసరాల కోసం ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తోందని, ఇందులో అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. గత ఐదేళ్లలో పౌరసరఫరాలశాఖలో పలు లోపాలు ఉన్నాయని, వాటిని ప్రస్తుతం సంస్కరిస్తున్నామని తెలిపారు. ధాన్యం సేకరణలో పంట పండించిన కౌలు రైతులకు వారి పంట సొమ్ము దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని సిద్ధార్థజైన్ తెలిపారు.

రోడ్ల పనుల్లో వేగం పెంచండి

- దెబ్బతిన్న వాటికి ప్రాధాన్యత

నిర్మాణంలో వున్న రోడ్ల పనులన్నింటిలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్ల పనులను ప్రాధాన్యతగా తీసుకుని పనిచేయాలన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని 5వ బ్లాక్‌లో జరిగిన కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశంలో సిఎం చంద్రబాబు ఆర్‌అండ్‌బి శాఖపై సమీక్షించారు. రాష్ట్రంలో 12,653 కిలోమీటర్ల స్టేట్ హైవేలు, 32,725 కిలోమీటర్ల జాతీయ రహదారులు వున్నాయని ముఖ్యమంత్రికి రోడ్లు, భవనాలశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే వివరించారు. 45,378 కిలోమీటర్ల మొత్తం రోడ్లలో 11,038 కిలోమీటర్ల రోడ్లు బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రస్తుతం రూ.192 కోట్లతో 3,971 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయని అన్నారు. రూ.284 కోట్లతో 7,067 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు.

రూ.2,153 కోట్లతో 5,731 కిలోమీటర్ల కొత్త రోడ్లను నిర్మించేందుకు తమ శాఖ కార్యాచరణ తయారు చేసిందని తెలిపారు. అనంతరం సిఎం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పాడైపోయిన రోడ్లన్నింటినీ పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల నిర్మాణాలకు కేంద్రం నుండి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్మాణంలో వున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే 9 షిప్పింగ్ హార్బర్లపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. నెల్లూరు జిల్లా దగదర్తి, కుప్పం, నాగార్జునసాగర్ వద్ద నూతనంగా విమానాశ్రయాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్లకు చంద్రబాబు దిశా నిర్దేశం

రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సమావేశం సోమవారం జరిగింది. అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగించడంతోపాటు వివిధ అంశాలపై సమీక్షించి, దిశానిర్దేశం చేశారు.

సచివాలయాల్లోనే ఇసుక

ఇసుక కావాల్సిన వినియోగదారులు తమ ప్రాంతంలోని సచివాలయాల్లో ఇసుక బుకింగ్ చేసుకునే విధానాన్ని తీసుకురానున్నట్లు సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మైనింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన అనంతరం సిఎం మాట్లాడారు. ఇసుక ప్రకృతి ప్రసాదించిన సహజ వనరని, అది సామాన్యుని హక్కు అని అన్నారు. అలాగని ఎవరికి వారు ఇష్టానుసారం దోచుకోవడాన్ని తమ ప్రభుత్వం సహించదన్నారు. సామాన్యులందరికీ ఉచిత ఇసుక ఉచితంగా లభించేలా పూర్తి పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక కావాల్సిన వినియోగదారులు ఇకపైన ఎంత ఇసుక కావాలో ఆయా ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచివాలయంలోనే బుకింగ్ చేసుకోవాలని, ఇసుక రీచ్ నుంచి తన ఇంటికి ఇసుక తీసుకెళ్లడానికి రవాణా ఛార్జీలు కూడా సచివాలయంలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని సిఎం వెల్లడించారు. రీచ్ నుంచి ట్రక్కుల్లో ఇసుక వినియోగదారుని ఇంటికి చేరిన తర్వాత వినియోగదారుడు తనకు ఇసుక చేరిందని చెప్పిన తర్వాతే రవాణా ఖర్చులు ఆ ట్రక్కు యజమానికి రిలీజ్ చేసేలా పద్ధతిని తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఇసుక తీసుకెళ్లడానికి ఉపయోగించే ట్రక్కులన్నీ ప్రీపెయిడ్ ట్యాక్సీల తరహాలో ఊబరైజేషన్ చేస్తామని చెప్పారు. రేట్లు కూడా స్టండరైజేషన్ చేస్తామని, పేదలకు, సామాన్యులకు చెందాల్సిన ఇసుక పక్కదారి పట్టించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఇసుక విధానంలో ఉదారంగా వ్యవహరించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దన్నారు.

ఇసుక అక్రమాలపై సిబిసిఐడి దర్యాప్తు

గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలపై సిబిసిఐడి దర్యాప్తు చేయిస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు కూడా సుప్రీంకోర్టు అడిగిన వివరాలకు సంబంధించి నిష్పక్షపాతంగా నిజాలు తెలపాలని సిఎం స్పష్టం చేశారు. ఖనిజ సంపద ప్రభుత్వానికి ఒక ఆదాయ వనరని, అందులో అక్రమాలకు తావు లేకుండా చూడాలని సూచించారు.

33 లక్షల టన్నుల ఇసుక లభ్యత : ముఖేష్‌కుమార్ మీనా

రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక స్టాక్ యార్డుల్లో దాదాపు 33 లక్షల టన్నుల ఇసుక లభ్యత ఉందని, ఇసుక కోసం వస్తున్న వారు నిజంగా ఇసుక అవసరమున్నవారా లేదా అనే విషయాలు అధికారులు పరిశీలించాలని గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తోందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కలెక్టర్లను ఆయన కోరారు. గత నాలుగేళ్లలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగాయన్నారు. సుప్రీంకోర్టుకు కూడా తప్పుడు నివేదికలు ఇచ్చారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ఒక అధికారిని కూడా సస్పెండ్ చేశామన్నారు.

ఎక్కడి వాళ్లకు అక్కడే ఇళ్ల స్థలాలు

సిఆర్‌డిఎ ఆర్5 జోన్‌పై ఆదేశాలు

ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎక్కడి వారికి అక్కడే ఇళ్ల స్థలాలిచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కలెక్టర్ల సమావేశంలో భాగంగా గృహ నిర్మాణశాఖపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సిఆర్‌డిఎ పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన వారికి సంబంధించి రీ వెరిఫికేషన్ చేయాలని, అనర్హులను గుర్తించి తొలగించాలని తెలిపారు. అర్హులకు సంబంధించి వారి సొంత జిల్లాల్లోనూ, సొంత ప్రాంతాల్లోనూ ఇళు, లేదా స్థలాలు కేటాయించేలా చూడాలన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ.. గృహ నిర్మాణ రంగంలో డెవలప్‌మెంట్ వెల్ఫేర్, ఎంప్లాయిమెంట్ జనరేషన్, పావర్టీ, ఎలివేషన్ వంటి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. పిఎంఎవై(అర్బన్), రూరల్, పిఎం జన్‌మన్, ఎన్‌టిఆర్ రూరల్ హౌసింగ్ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. మొత్తం 26,28,353 ఇళ్లకు అనుమతి లభించిందని, వీటిలో 11,42,049 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఎన్‌టిఆర్ రూరల్ హౌసింగ్ కింద 5,44,113 ఇళ్లు మంజూరైతే ఇప్పటికీ 4,56,929 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. 87,184 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. జిల్లాల వారీ హౌసింగ్ కార్యక్రమం కింద చేపట్టిన నిర్మాణ వివరాలను తెలిపి వాటి కొనసాగింపుపై కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన సిఎం ఇళ్ల నిర్మాణ విషయం కేంద్ర గైడ్‌లైన్స్‌కు అనుకూలంగా వ్యవహరించాలని, లబ్ధిదారుల గుర్తింపులోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల కొరత ఉండకూడదు

- అవసరమైతే విద్య వాలంటీర్లు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ల సదస్సులో విద్యాశాఖపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా టీచర్లు లేరన్న మాట వినపడకూడదని చెప్పారు. ఇప్పటికే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేశామని, ఇంకా ఎక్కడైనా ఖాళీలు ఉంటే విద్యా వాలంటీర్లనునియమించుకోవాలని సూచించారు. పిల్లలందరు బడిలో చేరాలన్నదే తమ లక్ష్య మని, డ్రాపవుట్స్ సంఖ్య జీరోకు చేరాలని వెల్లడించారు. బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని వెల్లడించారు. ఆరేళ్ల వయస్సు ఉన్న పిల్లలు బడిలో, అంతకంటే తక్కువ వయస్సు ఉన్న వాళ్లు అంగన్‌వాడీల్లో ఉండాలని చెప్పారు. కిట్ల పంపిణీలో 2,3 నెలల ఆలస్యమయిందని, సకాలంలో పంపిణీ చేయడంలో విఫలమైన సంబంధిత ఏజెన్సీని పక్కనబెట్టాలని ఆదేశించారు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలని తెలిపారు. విద్యావ్యవస్థ ధ్వంసమయ్యిందని, ప్రస్తుతం పాఠశాలల్లో విజ్ఞాన విహార యాత్రలు, క్రీడలు లేవన్నారు. మళ్లీ వీటిని ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ఒత్తిడిలేని విద్యను అభ్య సించాలని, ఆనందంగా పిల్లలు చదువుకునేలా ఉండాలని చెప్పారు.

మరింత మెరుగ్గా స్కిల్స్

విద్యార్థుల్లో స్కిల్స్ మరింత మెరుగుపరచాలని సిఎం ఆదేశించారు. 20లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చామని తెలిపారు. వర్క్‌స్టేషన్‌లు క్రియేట్ చేసి ఆ తరహా ఇన్నోవేటివ్ స్కీంలు తీసుకురావాలని చెప్పారు. తద్వారా 5-10లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. స్కిల్స్ మెరుగుపరుచుకుంటే అదనపు ఇన్సెంటివ్‌లు ఇస్తామని, దేశంలో ఈ తరహా విధానం ఎవరూ రూపొందించ లేదన్నారు. వర్చువల్ వర్కింగ్ పాలసీ తయారుచేయాలని చెప్పారు. రాష్ట్రాన్ని వర్చువల్ వర్కింగ్ హబ్‌గా మార్చి నైపుణ్యాలను మెరుగుపరుద్దామన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల వివరాలు వెలికితీయాలని చెప్పారు. ఎంతమంది వర్క్ చేస్తున్నారన్న వివరాలు సేకరించాలని తెలిపారు. ఉపాధి అన్ని ప్రాంతాలకు విస్తరించాలని వెల్లడించారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డిసి) అనేది యుపిఐ మాదిరి ప్లాట్‌ఫామ్ అని వివరించారు. దీనివల్ల ఒకే వేదికపైకి ఉత్పత్తిదారులు, వినియోగదారులు తీసుకొస్తామన్నారు. దీనివల్ల ఉత్పత్తి చేసిన వస్తువును అమ్ముకునే వీలు కలుగుతుందన్నారు.

ఇళ్ల లెక్కలు కేంద్రానికి చేరితే నిధులు రావు

గత వైసిపి ప్రభుత్వం 5,74,710 ఇళ్లు ప్రారంభించలేదని, ఈ లెక్కలు కేంద్రానికి చేరితే నిధులు రావని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కలెక్టర్ల సమీక్షలో గృహనిర్మాణ శాఖపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని లబ్దిదారులకు వివరించాలని అన్నారు. నిర్మాణం కాని ఇళ్లను పూర్తి చేయాలని చెప్పారు. గత ప్రభుత్వం సెంటు స్థలం పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. గత ప్రభుత్వం 25లక్షల ఇళ్లు కడతామని చెప్పి కేవలం 7లక్షల ఇళ్లు మాత్రమే నిర్మించిందన్నారు. గత ప్రభుత్వం అనర్హులకు ఇళ్లు కేటాయిస్తే చర్యలు తీసుకోవాలని, 2004-14 మధ్య కాలంలో కూడా ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయన్నారు. కేంద్రం దేశ వ్యాప్తంగా 3కోట్ల ఇళ్లు మంజూరు చేసిందని ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.4.30లక్షలు లబ్దిదారులకు అందిస్తామన్నారు. నీరు- చెట్టు, ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు కూడా త్వరలో చెల్లిస్తామని సిఎం తెలిపారు. . రూ.500కోట్లు గ్రామీణ హౌసింగ్ నుంచి మళ్లించారని, నిధులు మళ్లించినందుకు కేంద్రం, రాష్ట్రంపై రూ.28కోట్లు ఫైన్ కూడా వేసిందన్నారు. రూ.8వేలకోట్లు కేంద్రం నుంచి రాకుండా చేశారని, రూ.5వేల కోట్లు కార్పొరేషన్లకు రావాల్సిన ఫండ్స్ రాకుండా చేశారని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు.

నదుల అనుసంధానం దిశగా కార్యాచరణ

నదుల అనుసంధానం దిశగా కార్యాచరణను రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జలవనరులపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకు నదుల అనుసందానమే పరిష్కారమని అన్నారు. రాష్ట్రంలోని నదులన్నింటిలో పుష్కలంగా నీటి లభ్యత వుందని, ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జలవనరుల శాఖ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం, స్థితిగతులపై వివరించారు. రాష్ట్రంలో ముఖ్య నదులైన కృష్ణా, గోదావరి, పెన్నా, నాగావళి, వంశధారలతోపాటు 35 దాకా చిన్న నదులున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 38,422 మైనర్ ఇరిగేషన్ వనరులున్నాయని వివరించారు. రాష్ట్రం మొత్తంగా 26 జిల్లాల్లో 4 కోట్ల ఎకరాల ఆయకట్టు వుందని తెలిపారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదుల్లో వరద నీరు ఎక్కువగా వస్తోందని, నీటిని సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులను నింపేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో తక్కువ వ్యయంతో పూర్తయ్యే ప్రాజెక్టులను తక్షణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందన్నారు. గేట్లకు గ్రీజు పెట్టేందుకు కూడా నిధులు ఇవ్వక పోవడంతో చాలా ప్రాజెక్టులు ధ్వంసం అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి వాటి పట్ల అధికారులు అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు. ఎక్కడైనా గేట్లు కొట్టుకుపోతే సంబంధిత ఎఇ, డిఇలను తక్షణం సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

10లక్షలమంది కౌలు రైతులకు గుర్తింపుకార్డులు

- వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ తెలిపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖపై జరిగినసమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇ-పంట నమోదు కార్యక్రమంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఇ - పంట నమోదులో ఈ సారి నేరుగా రైతులు సాగు చేస్తున్న పొలం వద్దకే వచ్చి పంటను డిజిటల్ రికార్డ్ చేస్తారని తెలిపారు. దీంతో నిజంగా పొలంసాగు చేస్తున్న రైతుకు లబ్ధి చేకూరుతుందన్నారు.

ఇ-పంట డిజిటల్ రికార్డింగ్ తో 90శాతం కౌలు రైతులకు లబ్ధి చేకూరే అవకాశంఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులు వ్యవసాయరంగానికి ప్రతికూలంగా మారుతున్నాయన్నారు. కొన్నిచోట్ల రైతులు కేవలం ఒకే పంటకు పరిమితమవుతున్నారని, అలాంటి రైతులను గుర్తించి వారిని రెండు,మూడు పంటలు వేసే దిశగా ప్రోత్సహించాలన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వ్యవసాయరంగం ఆశాజనకంగా లేదని , వ్యవసాయ ఉత్పత్తి పడిపోయిందని, ఉత్పత్తి శాతం పెరిగేలా జిల్లాల్లో కలెక్టర్లు కీలకపాత్ర పోషించాలని రాజశేఖర్ సూచించారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- ఈ ఏడాది గ్రామ పంచాయతీల్లో 5.40 కోట్ల ట్యాప్ కనెక్షన్లు
- నూతనంగా 4,729 కిలో మీటర్ల రహదారుల నిర్మాణం
- పంచాయతీరాజ్ సమీక్షలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి గృహానికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు ఈ నెల 15 నుంచి పల్స్ సర్వే నిర్వహించనున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై కలెక్టర్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది గ్రామ పంచాయతీల్లో 5.40 కోట్ల ట్యాప్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. ఈ ఏడాది ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం అమలుపై పలు తీర్మాణాలు చేస్తూ గ్రామ పంచాయతీలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. 2014-19 మధ్య కాలంలో దాదాపు 10 వేల గ్రామ పంచాయతీల్లో ప్రారంభించిన ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు సూచించారు. 2047 కల్లా దేశం సూపర్ పవర్ కావాలనే లక్ష్యంతో వికసిత్ ఆంధ్రప్రదేశ్ కూడా ముందుకు వెళ్ళాలంటే కలెక్టర్లతోపాటు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కోరారు. పిఠాపురం నియోజకవర్గంలో గ్రే వాటర్ మేనేజ్‌మెంట్ విధానం ద్వారా లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు విధానాన్ని అధునాతన పద్ధతిలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించేందుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఇతర పథకాల కింద నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లను ఒడిఎఫ్ ప్లస్ కింద నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామీణ రోడ్ల పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు దాదాపు 4,729 కిలోమీటర్ల మేర నూతన రోడ్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని పవన్ తెలిపారు. రాష్ట్రంలో 29.23 శాతం మేర 37,431 చదరపు కిలోమీటర్లు నోటిఫైడ్ అటవీ ప్రాంతం ఉందని, ఆ ప్రాంతానికి బయట 10,221 చదరపు కిలోమీటర్లు పచ్చదనం విస్తరించి ఉన్న ప్రాంతాలతో పాటు చెరువు తీరాలు, కొండ ప్రాంతాలు, పంచాయతీ భూములు, పలు సంస్థల భూముల్లో కూడా పచ్చదనాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతాలను పరిరక్షించడం, ఆక్రమణలను తొలగించడం, చట్టవ్యతిరేక కార్యక్రమాలను నియంత్రించడం వంటి చర్యలు చేపట్టేందుకు కలెక్టర్లు సహకరించాలన్నారు.

'పోలవరం'లో తరలింపు 13.01శాతమే

- కలెక్టర్ల సమావేశంలో లెక్కలు
- మొత్తం కుటుంబాలు 96,660
- తరలించింది 12,797 మాత్రమే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని చెబుతున్న ప్రభుత్వాలు ఆచరణలో భూములు ఇచ్చిన వారిని నట్టేట ముంచుతున్నాయి. కలెక్టర్ల సమావేశంలో అధికారులు ఇచ్చిన తాజా గణాంకాల ప్రకారం ముంపునకు గురవుతున్న కుటుంబాల్లో 13.01 శాతాన్ని కూడా తరలించలేదు. మొత్తం కుటుమబాలు 96,600 ఉండగా 12,797 కుటుంబాలను మాత్రమే తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం పునరావాసం దాదాపుగా 22శాతం పూర్తి చేశామని చెబుతూనే ఈ గణాంకాలపు అధికారులు ప్రభుత్వానికి అందచేశారు.

పునరవాసం పునర్నిర్మాణానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు మొదటి దశ(41.15 మీటర్లు)కు అల్లూరి సీతారామరాజు జిల్లాలో 23,398 కుటుంబాలను తరలించాల్సి ఉండగా 5,664 కుటుంబాలను మాత్రమే తరలించారు. ఇంకా 17,734 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో 14,662 కుటుంబాలకుగాను 7,133 కుటుంబాలను తరలించారు. ఇంకా 7,529 కుటుంబాలు ముంపు ప్రాంతాల్లోనే ఉన్నాయి. అంతే మొత్తంగా మొదటిదశలో 38,060 కుటుంబాలకుగాను 12,797 కుటుంబాలను తరలించారు. మొత్తంగా 25,263 కుటుంబాలను ఇంకా తరలించాల్సి ఉంది. రెండోదశకు సంబంధించి 41.15 మీటర్లకుపైన తరలించాల్సిన కుటుంబాలకు అల్లూరి జిల్లాలో 44,105 కుటుంబాలను, ఏలూరు జిల్లాలో 29,157 కుటుంబాలను తరలించాల్సి ఉంది. వాటిల్లో ఒక్కటి కూడా తరలించలేదు. మొత్తంగా 96,660 కుటుంబాలకు గాను 12,797 కుటుంబాలను మాత్రమే తరలించగా ఇంకా 83,863 కుటుంబాలను తరలించాల్సి ఉందని వెల్లడించారు.

54,640 ఎకరాల పెండింగ్

అలాగే భూ సేకరణకు సంబంధించి రెండు దశల్లో భూసేకరణకు సంబంధించి రెండు దశల్లో వేర్వేరుగా వివరాలు వెల్లడించారు. 41.15 మీటర్ల ఎత్తు పరిధిలో అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 55,941.76 ఎకరాలకుగాను 39,678.25 ఎకరాలు సేకరించారు. ఇంకా 16,263.51 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో 44,157.82 ఎకరాలకుగాను 43,980.85 ఎకారలు సేకరించారు. ఇంకా 176.97 ఎకరాలు సేకరించాల్సి ఉంది. మొత్తంగా మొదటిదశలో 1,00,099.58 ఎకరాలకుగాను 83,659.10 ఎకరాలు సేకరించగా, 16,440.48 ఎకరాలు సేకరించాల్సి ఉంది. రెండోదశలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 54,460.87 ఎకరాలు తీసుకోవాల్సి ఉండగా 16,693.49 ఎకరాలు మాత్రమే సేకరించారు. ఇంకా 37,767.38 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో 13,204.68 ఎకరాలకుగాను 12,771.59 ఎకరాలు సేకరించారు. ఇంకా 433.09 ఎకరాలు పెండింగ్ ఉంది. మొత్తంగా భూసేరకణకు సంబంధించి 41.145 మీటర్లపై అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 1,10,402.63 ఎకరాలకుగాను, 56,371.74 ఎకరాలు సేకరించగా 54030.89 ఎకరాలు పెండింగ్‌లో ఉంది. ఏలూరు జిల్లాలో 57,362.50 ఎకరాలకుగాను 56,752.44 సేకరించగా ఇంకా 610.06 ఎకరాలు సేకరించాల్సి ఉంది. మొత్తంగా 1,67,765 ఎకరాలు సేకరించాల్సి ఉండగా 1,13,124.18 ఎకరాలు సేకరించారు. ఇంకా 54,640 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

భద్రత కుదింపుపై జగన్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

గతంలో తనకున్న జెడ్ ప్లస్ కేటగిరి భద్రతను తగ్గించడం అన్యాయమంటూ మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో సోమవారం పిటిషన్ వేశారు. తనను అంతం చేయడమే లక్ష్యంగా చేసుకుని జెడ్ ప్లస్ భద్రతను కుదించారని, తనకు ప్రాణహాని ఉన్న అంశాన్ని పక్కకుపెట్టిందన్నారు. తనకు జూన్ 3 నాటికి ఉన్న భద్రతను పునరుద్ధరించేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు, కౌంటర్ అసాల్ట్ టీమ్స్, జామర్లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వైసిపి లేఖ రాసినప్పటికీ స్పందన లేదన్నారు. 'భౌతికంగా లేకుండా చేయడమే అధికార కూటమి ధ్యేయం. ఈ విషయంపై టిడిపి నేతల వద్ద సంభాషణ జరిగిన వీడియో కూడా బయటకు వచ్చింది. జగన్ ఎన్నికల్లో మాత్రమే ఓడిపోయారు. ఇంకా బతికే ఉన్నారు.. అని స్పీకరు పదవిలో ఉన్న అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి' అని జగన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణ చేయనుంది.

ఎస్‌ఆర్‌సి నివేదికను సవాల్ చేసుకోవచ్చు : హైకోర్టు

ప్రాణహాని లేదంటూ భద్రత సమీక్ష కమిటీ (ఎస్‌ఆర్‌సి) ఇచ్చిన రిపోర్టుపై అభ్యంతరం ఉంటే దానిని రివ్యూ చేయాలని సంబంధిత అధికారులను కోరడమో లేక హైకోర్టులో సవాలు చేయడమో చేసుకోవాలని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టు సూచన చేసింది. మంత్రిగా ఉండగా ఉన్న 5ప్లస్5 భద్రతను కొనసాగించేలా ఉత్తర్వులివ్వాలంటూ పెద్దిరెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి విచారణ జరిపారు. తనకు 4ప్లస్4 భద్రతను కొనసాగించేలా రాష్ట్రానికి ఉత్తర్వులివ్వాలంటూ మిథున్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా హైకోర్టు విచారణ జరిపింది. మిథున్‌కు ప్రాణహాని లేదని నివేదిక వచ్చిందని ప్రభుత్వం చెప్పింది. ఆ నివేదిక మిథున్‌కు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించి విచారణను వాయిదా వేసింది.

'పిన్నెల్లి' కేసులో పోలీసులకు నోటీసులు

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సవాల్ చేసిన వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ రోజున పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఇవిఎం ధ్వంసం చేసి, అడ్డువచ్చిన టిడిపి ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారంటూ రెంటచింతల పోలీసులు పిటిషనర్‌పై కేసు నమోదు చేశారు. కారంపూడిలో సిఐ నారాయణస్వామిపై దాడి చేసి గాయపరిచారంటూ మరో కేసు నమోదు చేశారు.

టిటిడి బోర్డు సభ్యునిగా మరోసారి అవకాశం కల్పించండి : సిఎంకు శివకుమార్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : టిటిడి బోర్డు సభ్యునిగా మరోసారి అవకాశం కల్పించాలని వైసిపి వ్యవస్థాపక మాజీ అధ్యక్షులు కె శివకుమార్ కోరారు. ఈ మేరకు సిఎం చంద్రబాబునాయుడికి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖలు రాశారు. గతంలో మాదిరే తనకు తెలంగాణా రాష్ట్రం తరుపున టిటిడి బోర్డులో సభ్యునిగా అవకాశం కల్పించాలని కోరారు.

మెరుగైన పాలనే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రంగాలూ నిర్వీర్యం అయ్యాయని అన్నారు. విధ్వంసంతో గత ఐదేళ్ల పాలన ప్రారంభమైందని చెప్పారు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన వారు ఆర్‌బిఐ గవర్నర్లూ అయ్యారని, ప్రస్తుతం తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఐదేళ్లలో విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించాలంటే భారీ కసరత్తు చేయాలని తెలిపారు. ఇప్పటికి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామని అన్నారు. ఇటీవల వచ్చిన ఐదువేల పిటీషన్లలో సగం భూములకు సంబంధించినవే ఉన్నాయని వివరించారు. దీన్ని బట్టి విధ్వంసం ఏస్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని వివరించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ల్యాండ్ సర్వేను హోల్డ్‌లో పెట్టామని, ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేశామని వివరించారు. తప్పుచేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టొద్దని, కొంతమంది ఢిల్లీ వెళ్లి ధర్నా చేసి ఎపి బ్రాండ్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని, నాన్ ఫైనాన్షియల్ సమస్యలను ముందుగా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్లు వారి డిపార్టుమెంట్లకు సంబంధించి చేయబోయే అంశాలను వారి వద్ద ప్రణాళికలను సిఎంకు వివరించారు. ఈ సమయంలో ఒకరిద్దరు అధికారులపై సిఎం అసహనం వ్యక్తం చేశారు. పాత పద్ధతులను విడనాడి కొత్తగా ఆలోచించాలని, వాటితో ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రతి అంశాన్ని తనవద్దకు తీసుకురావాల్సిన అవసరం లేదని, ఆలోచించి అమలు చేయాలని ఆదేశించారు.

విద్యుత్ రంగంలో పెట్టుబడులకు పెద్దపీట

- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అమెరికాలోని ప్రవాస భారతీయులతో వర్చువల్‌గా మంత్రి గొట్టిపాటి సోమవారం సమావేశమయ్యారు. పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పెట్టుబడిదారులకు కావాల్సిన వసతులు కల్పించేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. విద్యుత్ రంగంలో సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తిలో పెట్టుబడులకు కంపెనీలు ముందుకు రావాలని కోరారు. గత ప్రభుత్వంలో 'ది నేషనల్ సోలార్ ఎనర్జీ ఫౌండేషన్' 'ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్' 'ఆసోచామ్' వంటి అసోసియేషన్ల సలహాలకు, విజ్ఞప్తులకు ప్రాధాన్యత దక్కలేదన్నారు. తమ ప్రభుత్వం వీరి సలహాలు, సూచనలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

కోర్బా ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై దర్యాప్తు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

కోర్బా ఎక్స్‌ప్రెస్ అగ్ని ప్రమాదంపై ఈస్ట్‌కోస్ట్ రైల్వే దర్యాప్తు ప్రారంభించింది. ముగ్గురు సభ్యుల ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పరిచింది. చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సూరత్ జానీ, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్ ఎస్సీ బెహెరా, చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ బిఎస్.నాథ్‌లను నియమించింది. ఆదివారం రాత్రి విశాఖపట్నం చేరుకున్న ఈ కమిటీ సభ్యులు సోమవారం ఉదయం స్టేషన్ యార్డ్, మెయింటెనెన్స్ డిపోలోని కోచ్‌ను పరిశీలించి విచారణ ప్రారంభించారు. రైల్వే అధికారులు, సిబ్బంది, స్టేషన్ సిబ్బందితో మాట్లాడి సంఘటన వివరాలు సేకరించారు. విచారణలో పాల్గొనేందుకు కోచ్‌ను తయారుచేసిన చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఆర్‌డిఎస్ఒ లక్నో నుంచి ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కూడా విశాఖపట్నం చేరుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర ఫోరెన్సిక్ బృందం కోచ్‌ను తనిఖీ చేయడం ద్వారా దర్యాప్తు ప్రారంభించిందని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

వైసిపి భూకబ్జాలపై 20న సదస్సు

- సిపిఐ రామకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి పాలనలో రాష్ట్రంలో జరిగిన భూ కబ్జాలపై ఈ నెల 20న విజయవాడలో సదస్సును నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ తెలిపారు. అనంతపురంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వ పాలనలో మదనపల్లిలో శ్మశనాలను కూడా కబ్జా చేశారని, అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రామచంద్రారెడ్డి సతీమణి పేరు మీద కూడా భూ కబ్జాలు చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు కుమ్మక్కై మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో భూ కబ్జాలు, తప్పుడు పత్రాలతో భూ ఆక్రమణలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిపై సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. కరువు నేపథ్యంలో రాయలసీమ ప్రాంతంలో 30 శాతం కూడా పంటలు సాగు కాలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

- టిడిపి నేతలు వర్ల కుమార్, రామారావు, సునీత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని పరిష్కరిస్తామని టిడిపి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ అధ్యక్షులు ఆచంట సునీత తెలిపారు. టిడిపి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వారు స్వయంగా తీసుకున్నారు. భూ కబ్జాలు, పింఛన్ తొలగింపు, అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు, ఉద్యోగ కల్పన వంటి సమస్యలతో ప్రజలిచ్చిన వినతులను అందుకున్నారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామంలో వైసిపి నేతలు తమ భూమిని ఆక్రమించారని పిన్నెబోయిన రమణమ్మ వినతిపత్రం అందజేశారు. చంపేస్తారన్న భయంతో మార్కాపురంలో ఉంటున్నానని, తన భూమిని విడిపించాలని కోరారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టు వల్ల తమ భూమి ఇతరుల పేరుపై ఎక్కిందని పల్నాడు జిల్లా తుర్లపాడు గ్రామానికి చెందిన చింతల శేషగిరిరావు తెలిపారు. 2014-19 మధ్య చేసిన నీరు-చెట్టు పనుల బిల్లులను వెంటనే మంజూరు చేయించాలని నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో వ్యవసాయశాఖ ద్వారా పనులు చేసిన తమకు బిల్లులు రాలేదని పలువురు తెలిపారు.

ధాన్యం బకాయిల కోసం ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఐవి, కౌలు రైతు సంఘం నాయకులు

ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 శాతం భూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నారని, దళిత, వెనుకబడిన తరగతులు, ఇతర కులాల్లోని పేదలే కౌలు రైతులుగా ఉన్నారన్నారు. వీరందరికీ భూ యజమాని సంతకం నిబంధన లేకుండా సిసిఆర్ కార్డులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు మాట్లాడుతూ.. రోజురోజుకూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెట్రోల్, డీజిల్ ధరలు, దుక్కి, దమ్ములకు ట్రాక్టర్ కిరాయిలు, కోత మిషన్ కిరాయిలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ప్రకృతి ప్రకోపానికి పంట చేతికందకుండా చేజారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో అప్పులపాలై కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రతి ఒక్కరికీ సిసిఆర్‌సి కార్డులు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు, జిల్లా నాయకులు బుంగ సత్యనారాయణ, శ్రీరామమూర్తి, కౌలు రైతులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

'ఎన్నో కష్టాలు పడి నిన్ను చదివించడానికి దూరాభారం పంపించాం.. చదువు మీదే ధ్యాసపెట్టు.. మిగతా విషయాల గురించి నీకొద్దు' అని తండ్రి మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ కేంద్రంలో సోమవారం జరిగిన ఈ ఘటనపై మృతురాలి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం, అమకత్రాడు గ్రామానికి చెందిన జక్కి, గౌరప్పకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె రేణుకఎల్లమ్మ (19) మాచర్లలోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ (ఇసిఇ) రెండో సంవత్సరం చదువుతూ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నారు. సోమవారం ఉదయం తమ మిత్రురాలు తమతో పాటు లేకపోవడంతో పక్క గదిలో చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉంది. యాజమాన్యానికి సమాచారమివ్వగా వారు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే కాలేజీకి చెందిన ఒక అబ్బాయి గత ఆదివారం గౌరప్పకు ఫోన్ చేసి ఎల్లమ్మ ఫోను కలవడం లేదని, మరో నంబర్ ఉంటే ఇవ్వాలని అడిగినట్లు మృతురాలి తండ్రి తెలిపారు. దీంతో తాను తన కుమార్తెకు ఫోన్ చేసి అబ్బాయిలకు నీ ఫోన్ నంబర్‌తో పనేమిటని, జాగ్రత్తగా ఉండాలని మందలించానని, బిడ్డ నొచ్చుకుందని మళ్లీ తానే బాధపడి పొద్దున్నే ఇక్కడికి బయలుదేరానని, అంతలోనే ఈ వార్త తెలిసిందని బోరున విలపించారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మాచర్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కొద్ది రోజుల క్రితం ఇదే కాలేజీకి చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి


ప్రజాశక్తి - మంత్రాలయం

ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ సంఘటన కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామం మోడల్ స్కూలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... సుంకేశ్వరి గ్రామానికి చెందిన కురువ గుండమ్మ, గుండప్ప దంపతులకు కుమార్తె పార్వతి (16) ఉన్నారు. మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌లో ఉంటూ పదవ తరగతి చదువుతున్నారు. అందరూ విద్యార్థులు నిద్రకు ఉపక్రమించిన తర్వాత ఫ్యాన్‌కు ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం గది తలుపులు తెరిచి చూసిన తోటి విద్యార్థులు ఫ్యాన్‌కు వేళాడుతున్న పార్వతి మృతదేహాన్ని చూసి సిబ్బందికి సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంత్రాలయం ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలపాలని తల్లిదండ్రులతో పాటు ఎఐఎస్ఎఫ్, రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. విద్యార్థిని మృతిపై దర్యాప్తు చేపట్టాలని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించండి

- ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డికి వినతి

ప్రజాశక్తి - విజయవాడ


ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డికి వినతిపత్రం అందిస్తున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పటాన్ షెట్టి రవి సుభాష్‌కు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం వినతిపత్రం సమర్పించారు. విజయవాడలోని సిపిడిసిఎల్ కార్యాలయంలో యూనియన్ డిస్కం కమిటీ తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగుల సమస్యలను వివరించారు. జెఎల్‌ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ఎపిఎస్‌ఇబి సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు 2022 పిఆర్‌సి బకాలు ఇవ్వాలని, 2014లో నియమితులైన జూనియర్ లైన్‌మెన్ల సర్వీసు పదేళ్లు గడుస్తున్నా నేటికీ రెగ్యులరైజ్ చేయకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే అందరికీ అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రమోషన్లు ఇవ్వాలని, డిగ్రీ, డిప్లొమా అర్హతలు కలిగిన క్షేత్రస్థాయి ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీర్ పోస్టుల్లో అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్ఫర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2024 జనవరి, జూలై డిఎ అలవెన్సు విడుదల చేయాలని, ఇపిఎఫ్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అపరిమిత వైద్య సౌకర్యం కల్పించాలని, బదిలీల్లో కౌన్సెలింగ్ పద్ధతి పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సుదర్శన రెడ్డి, డిస్కం అధ్యక్ష కార్యదర్శులు డి వెంకటేశ్వరరావు, ఎల్ రాజు, కోశాధికారి ఎంసిహెచ్ వీరాంజనేయులు, డిస్కం కార్యవర్గ సభ్యులు ఎం సుబ్బారెడ్డి, కె అంజయ్య, ఖాశీం వలీ, వి రాంప్రభాకర్, ఎం యోహాన్, డి సుబ్రమణ్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

కేంద్రం ఏకపక్ష వైఖరి దుర్మార్గం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ


ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

ఏకపక్ష వైఖరితో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నడం దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1271వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం నిర్వాసితులు తమ విలువైన భూములను త్యాగం చేశారని, ప్రజల సంపదను కొల్లగొట్టే హక్కు కేంద్రానికి లేదని అన్నారు. ఈ దీక్షల్లో ఎఐటియుసి నాయకులు డొక్కా నర్సింగరావు, కె రాజబాబు, తాండ్ర కనకరాజు, జి జయ, ఎ శివరామకృష్ణ, సీతారామరాజు, టిఎన్‌టియుసి నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్, విఎస్‌పిఇయు నాయకులు కాండ్రేగుల శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెటిపిఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత

- ఆధునిక టెక్నాలజీతో నేలమట్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కాలం చెల్లిన కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) పాత ప్లాంట్ (ఓఅండ్ఎం)లోని కూలింగ్ టవర్లు నేలమట్టం అయ్యాయి. సోమవారం ఉదయం 8.25 గంటలకు ఏ- స్టేషన్లోని నాలుగు కూలింగ్ టవర్లను అధికారులు ఒకసారిగా కూల్చేశారు. తరువాత బి- స్టేషన్‌లోని రెండు టవర్లను, సీ- స్టేషన్లోని మరో రెండు టవర్లను ఆధునిక టెక్నాలజీతో ఉన్నచోటనే నేలమట్టం చేశారు. పాత ప్లాంట్ తొలగింపు కాంట్రాక్ట్ దక్కించుకున్న హెచ్ఎర్ కమర్షియల్ సంస్థ ఈ టవర్ల కూల్చివేతను రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ఎక్సిక్యూడ్ కంపెనీకి అప్పగించింది. కంపెనీ డైరెక్టర్ ఆనంద్ శర్మ సారథ్యంలో ఇంప్లోజన్ పద్ధతిలో ఒకే చోట కుప్పకూలేలా పేలుడు పదార్థాలను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో శాఖ నుంచి విద్యుత్ లైన్ల క్లియరెన్స్ రాగానే, కూల్చివేత పనులు మొదలుపెట్టారు. సెకండ్ల వ్యవధిలో టవర్లు నేలమట్టం అయ్యాయి. టవర్ల శకలాలు దూరంగా పడకుండా అక్కడే కుప్పకూలేలా పిల్లర్ల చుట్టూ ఐరన్ మెస్లను ఏర్పాటు చేసి, క్లాత్‌తో సీల్ చేశారు. ఇప్పటికే కర్మాగారంలోని మిగతా విభాగాలను తుక్కుగా మార్చి తరలించడంతో చివరికి ఈ టవర్లు మాత్రమే మిగిలాయి. అవి కూడా ఈ రోజుతో పూర్తిగా కనుమరుగయ్యాయి.

1965-78లో కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ నిర్మాణం చేశారు. పాల్వంచ అంటే కేటీపీఎస్, దానిలో టవర్లు ఆనవాళ్లుగా చెప్పొచ్చు. 115 మీటర్ల ఎత్తులో ఉన్న ఇవి కొన్ని మైళ్లదూరం వరకు కనిపిస్తాయి. జపాన్ టెక్నాలజీతో కేటీపీఎస్ ఓఅండ్ఎమ్ కర్మాగారాన్ని నిర్మించారు. ఏ, బీ, సీ, స్టేషన్లలోని 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 1, 2, 3, 4 యూనిట్లు, 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5, 6, 7, 8 యూనిట్లు చేపట్టి 720 మెగావాట్లతో రాష్ట్రానికి వెలుగులు పంచారు. ఒక్కో స్టేషన్‌కు ఒక్కో కూలింగ్ టవర్ చొప్పున మొత్తం 8 నిర్మించారు. విద్యుదుత్పత్తి చేసే క్రమంలో నీరు, బొగ్గు మండించిన క్రమంలో వేడిని తగ్గించేందుకు కూలింగ్ టవర్లు ఉపయోగపడతాయి. నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడంతో ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం విశేషం.

రూ. 892 కోట్లతో 'గతిశక్తి'

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పలు కీలక పథకాలకు నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి గతి శక్తి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రోడ్లు, మౌళిక సౌకర్యాల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను రూపొందించింది. 892 కోట్ల రూపాయలు వీటి కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు సమాచారం.

మెగా ఇండస్ట్రియల్ హబ్స్‌కు రోజుకు 46 మిలియన్ లీటర్ల నీటిని అందించేందుకు 221.60 కోట్లతో తొలి ప్రాధాన్యతగా ప్రతిపాదించారు. ఇందులో కడప జిల్లాలోని కొప్పర్తిలోని రెండు పథకాలు ఉన్నాయి. అలాగే రెండో ప్రాధాన్యతగా అనకాపల్లి, అచ్యుతాపురం మధ్య నాలుగు లేన్ల రహదారికి, రౌతుసుమర్ల పారిశ్రామిక కారిడార్‌కు రహదారి అనుసంధానానికి, నాయుడుపేట, నక్కపల్లి పారిశ్రామిక కారిడార్‌కు, కియా మోటార్స్ పరిశ్రమ కోసం రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 180.40 కోట్లకు ప్రతిపాదించారు.

ఇదే సమయంలో మరో 202 కోట్ల రూపాయలతో కూడా పలు పథకాలకు ప్రతిపాదనలు సిద్ధంచేసినట్లు తెలిసింది.

రవాణా సరళీకృతం చేసేందుకే

పారిశ్రామిక రంగంలో సరుకు రవాణా, ఇతర ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను వేగవంతం చేసేందుకు ఈ పనులు ఉపయుక్తంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. రోడ్లను అభివృద్ధి చేయడం, పారిశ్రామిక వాడలకు రహదారి సౌకర్యాలు అనుసంధానం చేయడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు వారు అంటున్నారు. ఈ నిధులను త్వరగా రాబట్టేందుకు కేంద్ర అధికారులతో రాష్ట్ర అధికారులు చర్చలు సాగిస్తున్నట్లు తెలిసింది.

టెట్‌కు 4,27,300 దరఖాస్తులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 4,27,300 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు ఈ నెల 3వ తేదీతో ముగిసిందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు వి విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి) విభాగంలో పేపర్-1ఎకు 1,82,609 మంది, ఎస్‌జిటి ప్రత్యేక విద్య పేపర్-1బికు 2,662 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎ) విభాగంలో పేపర్-2ఎ లాంగ్వేజెస్‌కు 64,036 మంది, మేథ్స్ అండ్ సైన్స్‌కు 1,04,788 మంది, సోషల్ స్టడీస్‌లో 70,767 మంది, ప్రత్యేక విద్య పేపర్-2బికు 2,438 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులందరూ సన్నద్ధం కావాలని కోరారు.

అగాథంలోకి రూపాయి



న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ రికార్డ్ స్థాయిలో పడిపోయింది. సోమవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 31 పైసలు పతనమై ఆల్‌టైం కనిష్ట స్థాయి 84.03కి దిగజారింది. అమెరికాలో మాంద్యం భయాలకు తోడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, భారత మార్కెట్ల భారీ పతనం తదితర పరిణామాలు రూపాయి విలువను మునుపెన్నడూ లేని విధంగా అగాథంలోకి పడేశాయి. భారతీయ ఈక్విటీ మార్కెట్ల తీవ్ర పతనం, విదేశీ నిధులు తరలిపోవడం ప్రభావం చూపాయని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు.

ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 83.78 వద్ద ప్రారంభమైంది ఇంట్రాడేలో గరిష్ఠ స్థాయి 83.76 నుంచి 84.03 కనిష్ట స్థాయిని తాకింది. రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుంది.


బోల్తా పడిన స్కూల్ బస్సు

స్కూల్ బస్ బోల్తా

- 20 మంది విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం తోటూరులోని సత్యసాయి స్కూల్‌కి చెందిన బస్ సోమవారం ఒడిశా రాష్ట్రం జట్టిభద్ర-సుమండి గ్రామాల మధ్యలోని రోడ్డు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 20 మంది చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. మలుపు తిరుగుతుండగా... ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టమూ లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూలు యాజమాన్యం ఘటన స్థలానికి చేరుకొని ఇచ్ఛాపురంలో ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం విద్యార్థులను తరలించారు. చిన్నారుల పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. రెగ్యులర్ డ్రైవర్ సెలవు పెట్టడంతో హాల్టింగ్ డ్రైవర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఎమ్మెల్యే నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, ఎంఇఒ అప్పారావులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నాగార్జున సాగర్ గేట్లు ఎత్తివేత

- 16 గేట్ల ద్వారా 1.13 లక్షల క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం అధికారులు గేట్లను ఎత్తారు. ఉదయం ఆరు, మధ్యాహ్నం ఎనిమిది, సాయంకాలం రెండు కలిపి మొత్తం 16 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1.13 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 584 అడుగులకు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా ప్రస్తుతం 294.55 టిఎంసిల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పులిచింతల గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 6.73 టిఎంసిల నిల్వ ఉంది. సాగర్ నుంచి పులిచింతలకు దాదాపు లక్ష క్యూసెక్కుల నీరు వస్తుండడంతో 26 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. పులిచింతల దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

గరిష్ట స్థాయికి శ్రీశైలం నీటిమట్టం

- పది గేట్ల ద్వారా దిగువకు విడుదల

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. జలాశయం నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవాహం కొనసాగుతుండడంతో సోమవారం పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ జూరాల నుంచి 2,69,914 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 99,153 క్యూసెక్కులతో కలిపి 3,69,067 క్యూసెక్కుకుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను 204.7889 టిఎంసిలు నమోదయ్యాయి. కుడి, ఎడమ విద్యుత్తు ఉత్పత్తి అనంతరం సాగర్‌కు 3,75,178 క్యూసెక్కుకుల నీటిని విడుదల చేస్తున్నారు.

వాదనలు వినిపించకుంటే పిటిషన్ వెనక్కి తీసుకోండి

- కవిత బెయిల్ పిటిషన్‌పై ట్రయల్ కోర్టు వ్యాఖ్య
- తదుపరి విచారణ రేపటికి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వాదనలు వినిపించకుంటే దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి (విత్ డ్రా) తీసుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తరపున న్యాయవాదులకు రౌస్ అవెన్యూ (ట్రయల్) కోర్టు స్పష్టం చేసింది. కవిత దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై రెండు సార్లు వాయిదా పడిన నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. లిక్కర్ స్కామ్‌లో కవిత పాత్రపై ఇటీవల సిబిఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జిషీట్ ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అయితే, అసలు ఛార్జిషీటే సరిగ్గా లేదని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ.. కవిత రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం సిబిఐ స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేనందున, విచారణ వాయిదా వేయాలని కవిత తరపున న్యాయవాది అభ్యర్థించారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన స్పెషల్ జడ్జ్, న్యాయవాదులు నితీష్ రాణా, మోహిత్‌రావు రాలేదా? అని ప్రశ్నించారు. 'వాదనలు వినిపించకపోతే దాఖలు చేసిన పిటిషన్ వెనక్కి (విత్ డ్రా) తీసుకోండి. డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై వాదనలకు చివరిసారి అవకాశం కల్పిస్తున్నాం' అని చెప్పారు. తదుపరి విచారణ ఆగస్టు 7న మధ్యాహ్నం 12:30 వాయిదా వేశారు. కాగా, ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను మార్చి 15న ఇడి, ఏప్రిల్ 11న సిబిఐ అరెస్టు చేశాయి. తొలుత ఇడి ఆ తరువాత సిబిఐ కస్టడీలోకి తీసుకుని విచారించాయి. అనంతరం కవితతోపాటు మరో నలుగురి ప్రమేయంపై సిబిఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసింది.

వర్గీకరణపై ఎన్‌డిఎలో భిన్నాభిప్రాయాలు

- రివ్యూ పిటిషన్ వేస్తామన్న చిరాగ్ పాశ్వాన్
- ఎటూ తేల్చుకోలేకపోతున్న బిజెపి
- ఉత్తరాదిన నష్టపోతామని ఆందోళన

న్యూఢిల్లీ : ఎస్‌సిలో ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎన్‌డిఎలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బిజెపి ఇరకాటంలో పడుతోంది. ఎస్‌సిలో ఉప వర్గీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్‌డిఎలో భాగమైన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) వ్యతిరేకించింది. దీనిపై రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పును బిఎస్‌పి అధినేత మాయావతి కూడా వ్యతిరేకించారు. రిజర్వేషన్లకు సంబంధించి దళితులకు క్రీమిలేయర్‌ను వర్తింపచేయకూడదని చిరాగ్ పాశ్వాన్ అభిప్రాయపడ్డారు. దళితులను అంటరానివారిగా పరిగణించి శతాబ్దాల తరబడి సామాజిక బహిష్కరణ చేశారని, అందుకే రిజర్వేషన్లను రాజ్యాంగంలో చేర్చడం జరిగిందని ఆయన తెలిపారు. 'దళితులు ఎంత విద్యావంతులైనా, సంపన్నులైనా సమాజంలో వారి స్థానం ఏమీ మారలేదు' అని చిరాగ్ అన్నారు. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నది తమ పార్టీ నిర్ణయమని, దీనిపై బిజెపిని సంప్రదించలేదని అన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై బిజెపి కూడా ఇప్పటి వరకూ స్పష్టమైన వైఖరిని వెల్లడించలేదు. ఎస్‌సిల ఉప వర్గీకరణను చేపట్టాలంటే ముందుగా కులగణనను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు బిజెపి సుముఖత చూపడం లేదు. తెలంగాణలో ఎస్‌సిల ఉప వర్గీకరణను బిజెపి సమర్థించింది. ఉప కోటాపై మాదిగల దీర్ఘకాల డిమాండ్‌ను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు.

భారతీ ఎయిర్‌టెల్ లాభాలు 158% వృద్ధి



న్యూఢిల్లీ : టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ లాభాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో 158 శాతం వృద్ధితో రూ.4,159 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,612 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ1లో ప్రతీ వినియోగదారుడి నుంచి సగటు రాబడి (ఎఆర్‌పియు) 5.5 శాతం పెరిగి రూ.211కు చేరింది. కంపెనీ రెవెన్యూ 10.1 శాతం పెరిగి రూ.29,046 కోట్లుగా చోటు చేసుకుంది.

సంపాదకీయం


రైల్వేపై నిర్లక్ష్యం

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం ఆగి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని కీలలు పుట్టి ఒక ఎ.సి. బోగీ పూర్తిగా, రెండు బోగీలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. రైల్వే సిబ్బంది అప్రమత్తం కావడంతో గండం గడిచింది. ప్రమాద సమయంలో రైలులో ఎవరూ లేని కారణంగా ప్రాణనష్టం సంభవించలేదు. జూన్‌లో పశ్చిమ బెంగాల్‌లో కాంచనగంగ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురి కావడంతో పది మంది మృత్యువాత పడగా 60 మంది వరకు క్షతగాత్రులయ్యారు. యుపిలో డిబ్రూగఢ్-చండీగఢ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై నలుగురు చనిపోగా 32 మంది గాయపడ్డారు. జంషెడ్‌పూర్ వద్ద హౌరా-ముంబయి ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన యాక్సిడెంట్‌లో ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిసిపోగా 20 మంది గాయపడ్డారు. ఇవి కేంద్రంలో మోడీ నేతృత్వంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కొలువుతీరాక జరిగిన కొన్ని రైలు ప్రమాదాలు. ముందటేడాది ఒడిశాలో బహనాగా బజార్ స్టేషన్ వద్ద మూడు రైళ్లు ఢీకొని 300 మందిని బలిదీసుకున్న అత్యంత విషాదం స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో జరిగిన అతిపెద్ద రైలు ప్రమాదాల్లో మూడవది. వరుసగా చోటు చేసుకుంటున్న రైలు ప్రమాదాలను చూస్తుంటే గత పదేళ్లల్లో బిజెపి ప్రభుత్వ వైఫల్యం కళ్లకు కడుతుంది. మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ రైల్వే పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి పెద్ద ఉదాహరణ. ఆర్థిక మంత్రి రైల్వే బడ్జెట్ గురించి కనీసం తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించలేదంటే రైల్వేపైనా, ప్రయాణీకులపైనా బిజెపి సర్కారు ఎంత మాత్రం విలువ ఇస్తున్నదో అర్థమవుతుంది.

భారత రైల్వే ప్రపంచంలో అతిపెద్ద రైలు నెట్‌వర్క్ కలిగిన వ్యవస్థలలో నాల్గవది. ప్రతి రోజూ 22,500 రైళ్ల ద్వారా 2.40 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేరుస్తోంది. అంతేకాకుండా 20.30 కోట్ల టన్నుల సరకును రావాణా చేస్తోంది. రైల్వే ద్వారా ఈ సంవత్సరం రూ.80 వేల కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. రైల్వే బడ్జెట్ రూ.2.75 లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. రైల్వే నుంచి పెద్ద ఎత్తున ఆదాయం ఆర్జిస్తున్న ప్రభుత్వం భద్రతపై కనీస మాత్రం శ్రద్ధ పెట్టట్లేదనడానికి ఏళ్లుపూళ్లు సాగుతున్న ప్రాజెక్టులే నిలువెత్తు సాక్ష్యాలు. రైల్వేతో, దేశాభివృద్ధికి, ప్రజలకు ఉన్న అవినాభావ సంబంధం రీత్యానే గత ప్రభుత్వాలు రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగా చూశాయి. మోడీ రాగానే సాధారణ బడ్జెట్‌లో ఒక పద్దు కింద విలీనం చేసి ఆ వ్యవస్థకు ప్రాధాన్యత లేకుండా చేశారు. రైల్వేలో దశాబ్దాల నుంచి పర్మినెంట్ సిబ్బంది నియామకాల్లేవు. రెండు లక్షలకుపైన పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్‌లో ప్రభుత్వమే ప్రకటించింది. తగినంత సిబ్బంది లేకుండా, ఉన్న వారిపై అదనపు భారం వేస్తూ రైల్వేని నడపడం శ్రేయస్కరమేనా? ఇప్పటికీ సిబ్బంది కాపలా లేని 559 లెవెల్ క్రాసింగ్‌లు ఉన్నాయంటే ప్రజల భద్రత గాలిలో పెట్టిన దీపమేనని అర్థమవుతుంది.

దేశంలో ఏడాదికి సగటున 54 రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయి. ప్రమాదం జరిగిన ప్రతిసారీ మానవ తప్పిదాలుగానో, సాంకేతిక కారణాలుగానో, ఉగ్ర కోణంగానో పేర్కొని ఒకరిద్దరిపై చర్యలు తీసుకొని మమ అనిపించి ప్రభుత్వ వ్యవస్థాగత వైఫల్యాలను కప్పిపెట్టడం రివాజైంది. రైల్వే ప్రక్షాళనకు ఎన్నో అధ్యయనాలు, విచారణ నివేదికలు ఉన్నా ఆ వైపు చూడట్లేదు. రైల్వే భద్రత కోసం ఉన్న డిఆర్‌ఎఫ్, ఆర్‌ఎస్‌ఎఫ్, ఆర్‌ఆర్‌ఎస్‌కె నిధులు రావట్లేదని కాగ్ ఎత్తి చూపిందంటే మోడీ ప్రభుత్వానికి ప్రయాణీకుల ప్రాణాలంటే లెక్క లేదని తెలుస్తుంది. మోడీ సర్కారు రైల్వే ప్రైవేటీకరణ దిశగా దూసుకెళుతోంది. ప్రైవేటు రైళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైల్వే స్టేషన్లను, డిజిటలైజేషన్‌ను, రైల్వే భూములను, రైలు బోగీల నిర్మాణాలను, అదానీ, అంబానీ, ఇతర కార్పొరేట్లకు అప్పగిస్తోంది. వందే భారత్, బుల్లెట్, మెట్రో ట్రైన్‌ల వంటివి అందులో భాగమే. జనరల్, స్లీపర్ కోచ్‌లను తగ్గించి, ఎ.సి. కోచ్‌లను పెంచి రైళ్లను సామాన్యులకు, పేదలకు దూరం చేస్తోంది. రోగులు, వృద్ధులు తదితర కేటగిరీలకు రాయితీలను ఎత్తేసింది. బెంబేలెత్తిస్తున్న రైలు ప్రమాదాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టాలి. ప్రజల బతుకులో అంతర్భాగమైన రైల్వే వ్యవస్థను కాపాడుకోడానికి ప్రజలూ కంకణధారులు కావాలి.

మహనీయుల మాట




విజ్ఞానాన్ని పొందాలనుకుంటే
దానికై పరిశ్రమించక తప్పదు.
శ్రమపడటం అనేది జీవన సూత్రం.

- జాన్ రస్కిన్,
బ్రిటిష్ రచయిత.

నూతన ప్రభుత్వం ముందున్న విద్యారంగ సవాళ్లు

విశ్లేషణ



కె.యస్.లక్ష్మణరావు

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఘన విజయం సాధించిన తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 నెలలు కావస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాలపై శ్వేత పత్రాలు విడుదల చేసిది. విద్యా రంగంపై కూడా శ్వేత పత్రం విడుదల చేసి ఉంటే, ఆ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు గురించి విస్తృతంగా చర్చ జరగటానికి అవకాశం ఉండేది. నూతన విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్...పాదయాత్ర చేసినప్పుడే అనేక అంశాలు ఆయన దృష్టికి వచ్చాయి. వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల 5 రోజుల పాటు జరిగిన శాసనసభ, శాసనమండలి సమావేశాలలో చర్చకు వచ్చిన అనేక విద్యా రంగ సమస్యలపై అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటామని మంత్రివర్యులు హామీ ఇచ్చారు.

జీవో నెం.117, తరగతుల తరలింపు రద్దు

గత ప్రభుత్వం వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి కొన్ని ప్రయత్నాలు చేసింది. కాని పాఠశాలల నిర్వహణలో విఫలమయ్యారు. జీవో నెం.117 ద్వారా హేతుబద్దీకరణ ప్రక్రియ చేపట్టి ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను తగ్గించారు. ఉపాధ్యాయులపై పని భారాన్ని పెంచారు. 'యాప్'ల సంఖ్య పెంచి ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టలేని పరిస్థితి కల్పించారు. ఆనాటి ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల పేరుతో పాఠశాలలు సందర్శించి ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేశారు. అనేక మందిని చిన్న కారణాలతో సస్పెండ్ చేయడం, ఇంక్రిమెంట్లు 'కట్' చేయటం తదితర చర్యలు చేపట్టారు. ఉపాధ్యాయులు, అధికారులు ప్రశాంత వాతావరణంలో పని చేయలేని పరిస్థితిని ఆయన కల్పించారు. దీనితో పాటు ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను హైస్కూళ్లకు, కిలోమీటర్ లోపు స్కూళ్లను తొలి దశగా తరలించారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలలు నష్టపోయాయి. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఆ విధంగా తరలించడం జాతీయ విద్యా హక్కు చట్టానికి పూర్తిగా విరుద్ధం. ప్రాథమిక పాఠశాల అంటే 1 నుంచి 5 తరగతులు లేక 1 నుంచి 8 తరగతులు అని జాతీయ విద్యా హక్కు చట్టం స్పష్టంగా చెప్పింది. పాఠశాల విద్యకు తీవ్ర నష్టం కలుగచేసిన జీవో నెం.117ను రద్దు చేయటమేకాక, హైస్కూళ్లకు తరలించిన 3,4,5 తరగతుల తరలింపును కూడా రద్దు చేయాలి.

ఇప్పుడు నూతన ప్రభుత్వం 'పని సర్దుబాటు' (వర్క్ అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియను ప్రారంభించింది. ఉపాధ్యాయుల కొరత ఎదుర్కుంటున్న పాఠశాలల కొరత తీర్చటానికి 'పని సర్దుబాటు'కు పూనుకున్నది. కాని సర్దుబాటు ప్రక్రియ జీవో నెం.117 అనుగుణంగా జరుగుతున్నది. జీవో నెం.117 రద్దు చేసి, నూతన నిబంధనలు రూపొందించాలి. వాటికి అనుగుణంగా మాత్రమే 'పని సర్దుబాటు' ప్రక్రియ జరగాలి.



> ఇటీవల జరిపిన ఎన్నికలలో నిరుద్యోగులు గత ప్రభుత్వంపై తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, మోగా డిఎస్‌సి ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాసనమండలిలో పి.డి.ఎఫ్, ఇతర ఎమ్మెల్సీలు కూడా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటి ఫలితంగా నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మొదటి ఫైల్ మీద సంతకం చేశారు. టెట్ నోటిఫికేషన్ ఇచ్చారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి, పోస్టుల భర్తీ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతి సంవత్సరం ఇచ్చే విధంగా జాబ్ క్యాలండర్ రూపొందించాలి.

ప్రాథమిక పాఠశాలల్లో మార్పులు

రాష్ట్రంలో సుమారుగా 75 లక్షల మంది పాఠశాల విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో 50 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉండగా, 50 శాతం ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రమక్రమంగా పిల్లలు తగ్గిపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం కలిగించవలసిన అవసరమున్నది. ముఖ్యంగా రాష్ట్రంలో 34 వేల ప్రాథమిక పాఠశాలలు ఉండగా, వీటిలో దాదాపు 20 వేల పాఠశాలల్లో పిల్లల సంఖ్య 30 కంటే తక్కువగా ఉన్నది. 2 గదుల్లో ఇద్దరు ఉపాధ్యాయులు 5 తరగతులు నిర్వహిస్తున్నారు. ఇవి తల్లిదండ్రుల విశ్వాసం పొందలేకపోతున్నాయి. ప్రతి గ్రామంలో ఒక మంచి ప్రాథమిక పాఠశాల 5 గదులు, ఐదుగురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు, ఇతర సౌకర్యాలతో రూపుదిద్దుకోవలసిన అవసరమున్నది. గత తెలుగుదేశం పార్టీ పాలనా కాలంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పేరుతో ఒక ప్రయత్నం జరిగింది. ప్రాథమిక పాఠశాలలను పటిష్టపరచటానికి ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన ఆలోచనలతో ప్రణాళికను రూపొందించవలసిన అవసరమున్నది.

సిలబస్, మీడియం మార్పులు

గత ప్రభుత్వం సిలబస్, మీడియంలకు సంబంధించి ఎవరితో సంప్రదించకుండా ఏకపక్షంగా మార్పులు చేసింది. తెలుగు మీడియం మొత్తం రద్దు చేసి ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టింది. కనీసం సమాంతర మీడియంకు కూడా అవకాశం ఇవ్వలేదు. ప్రశ్నించిన వారిపై పేదల వ్యతిరేకులని ఎదురు దాడి చేసింది. హైస్కూళ్లలో సమాంతర మీడియం ప్రవేశ పెట్టవలసి ఉంది. అదేవిధంగా రాష్ట్ర సిలబస్‌ను రద్దు చేసి మొత్తం సి.బి.ఎస్.ఈ బోర్డుకు అనుబంధం చేశారు. దీనితో పదవ తరగతి విద్యార్థులకు రెండు రకాల పరీక్షలు అనగా 1000 పాఠశాలల విద్యార్థులకు సి.బి.ఎస్.ఈ బోర్డు, మిగిలిన పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర పరీక్షల బోర్డు నిర్వహిస్తుంది. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐ.బి సిలబస్, టోఫెల్ విధానం, బైజూస్ విధానం పూర్తిగా రద్దు చేయాలి.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ - డిఎస్‌సి

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఒక డిఎస్‌సి కూడా నిర్వహించలేదు. శాసనమండలిలో చర్చ సందర్భంగా ఆనాటి విద్యామంత్రి బొత్స సత్యనారాయణ కేవలం 117 పోస్టులే ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇటీవల జరిపిన ఎన్నికలలో నిరుద్యోగులు గత ప్రభుత్వంపై తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, మోగా డిఎస్‌సి ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాసనమండలిలో పి.డి.ఎఫ్, ఇతర ఎమ్మెల్సీలు కూడా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటి ఫలితంగా నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మొదటి ఫైల్ మీద సంతకం చేశారు. టెట్ నోటిఫికేషన్ ఇచ్చారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి, పోస్టుల భర్తీ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతి సంవత్సరం ఇచ్చే విధంగా జాబ్ క్యాలండర్ రూపొందించాలి.

రెసిడెన్షియల్ పాఠశాలలు

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూళ్లతో పాటు 352 కస్తూరి బా బాలికల విద్యాలయాలు, 150 ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూళ్లు గ్రామీణ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కస్తూరి బా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు విద్యాశాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్నాయి. ఈ స్కూళ్లను పటిష్ట పరచవలసిన అవసరమున్నది. ముఖ్యంగా కస్తూరి బా విద్యాలయాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం కాంట్రాక్ట్ పద్ధతిలో కొనసాగుతున్నారు. ఈ పోస్టులను మినిమం టైంస్కేల్ లోకి లేదా రెగ్యులరైజేషన్ లోకి మార్చవలసిన అవసరమున్నది. ఇతర గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజేషన్ చేయాలి. పార్ట్-టైమ్, గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయులకు కూడా ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుదలకు సంబంధించి న్యాయం జరగాలి. గురుకులాల ఉపాధ్యాయులకు కూడా 010 సౌకర్యం కల్పించి, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలి. మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలి. గురుకుల పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఐ.ఐ.టి, నీట్, క్లాట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికను రూపొందించాలి.

హైస్కూళ్లలో ప్లస్ 2 తరగతులు

గత ప్రభుత్వం 292 హైస్కూళ్లలో ఎటువంటి సంసిద్ధత లేకుండా ప్లస్ 2 తరగతులు ప్రారంభించింది. సరైన సౌకర్యాలు లేకుండా ప్రారంభించటంతో దాదాపు అన్నిచోట్ల విద్యార్థుల చేరిక చాలా తక్కువగా ఉన్నది. ప్లస్ 2 తరగతులు విజయవంతం కావాలంటే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, భోజనంతో పాటు అధ్యాపకులను ప్రయోషన్లు ఇచ్చి నియమించాలి. ప్లస్ 2 కోసం తరగతి గదుల నిర్మాణం ప్రత్యేకంగా జరగాలి. హైస్కూళ్లలో ప్లస్ 2 ప్రవేశ పెట్టిన చోట్ల గ్రామాలలో విస్తృతంగా ప్రచారం జరగాలి. ముఖ్యంగా బాలికలను పెద్ద సంఖ్యలో చేర్చటానికి ప్రయత్నం జరగాలి.

అధ్యాపకుల రెగ్యులరైజేషన్

రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయటానికి గత ప్రభుత్వం చట్టం చేసింది. దీనికి అనుగుణంగా జీవో నెం.114 విడుదల చేశారు. రాష్ట్రంలో 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్‌కు అర్హత కలవారిగా గుర్తించాలి. కానీ ఆచరణలో సుమారు 3 వేల మంది మాత్రమే రెగ్యులరైజ్ అయ్యారు. వివిధ కారణాలతో విద్యాశాఖలో రెగ్యులరైజేషన్ ప్రక్రియ ముందుకి కొనసాగలేదు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,600 మంది, డిగ్రీ కళాశాలల్లో 700 మంది, పాలిటెక్నిక్ కళాశాలల్లో 400 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. వీరిని రెగ్యులరైజేషన్ చేయటానికి నూతన ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసి ఉన్నది.

రాష్ట్ర విశ్వవిద్యాలయాలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 24కిపైగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్నాయి. గత 15 ఏళ్లగా విశ్వవిద్యాలయాలలో అధ్యాపక పోస్టులు భర్తీ కాకపోవటంతో విద్యా ప్రమాణాలు క్షీణించాయి. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ యూనివర్శిటీల సంఖ్య పెరిగిపోతున్నది. విశ్వ విద్యాలయాలలో సుమారు 5 వేలకు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2018లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్ష నిర్వహించింది. ప్రభుత్వం మారటంతో ప్రక్రియ కొనసాగలేదు. నూతన ప్రభుత్వం న్యాయ వివాదాలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టి పోస్టులు భర్తీ చేయాలి. 2019-2024 మధ్య నియమితులైన వైస్ ఛాన్సలర్లు విశ్వవిద్యాలయాల అభివృద్ధి కంటే, రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చారు. నూతన ప్రభుత్వం విద్యావేత్తలను, వివాద రహితులను గుర్తించి వైస్ ఛాన్సలర్లుగా నియమించాలి. యూనివర్శిటీల ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లలో కూడా విద్యావేత్తలతో పాటు సమాజంలో సంక్షేమం కోసం కృషి చేస్తున్న వారిని గుర్తించి నియమించాలి.

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ 2019-24 మధ్య అనేక నిర్ణయాలు ఏకపక్షంగా చేశారు. డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టి, విద్యార్థులను క్షోభకు గురిచేశారు. డిగ్రీ విద్యార్థులకు ప్రవేశ పెట్టిన 'ఇంటర్న్ షిప్' సక్రమంగా అమలు జరగలేదు. డిగ్రీలో ప్రవేశ పెట్టిన మేజర్, మైనర్ సబ్జెక్టు విధానం వల్ల కొన్ని సబ్జెక్టులు నష్టపోతున్నారు. ఈ అంశాలపై నూతన విద్యామంత్రి అందరితో చర్చించి నిర్ణయాలు చేయాలి. ఎయిడెడ్ విద్యా సంస్థలకు సంబంధించి ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉండేలా నిర్ణయాలు చేయాలి.

సాంకేతిక విద్యాసంస్థలు

రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 300 ఇంజనీరింగ్ విద్యా సంస్థలు సాంకేతిక విద్యా రంగంలో పని చేస్తున్నాయి. వీటిలో 280కి పైగా ప్రైవేట్ రంగంలోనే ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న యూనివర్శిటీలలో గల ఇంజనీరింగ్ కళాశాలలను ఆధునీకరించవలసిన అవసరమున్నది. ఆ కళాశాలల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీలను ఐ.ఐ.టీల స్థాయిలో అభివృద్ధి చేయవలసిన అవసరమున్నది. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి పెంచటానికి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికపై స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అభివృద్ధి చేయాలి.

/ వ్యాసకర్త శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083 /

జనవాక్యం

దొంగ స్వాములకు పాలకుల మద్దతా!

కోట్లాది రూపాయల విలువగలిగిన గుడ్లూరు మండలం చేవూరు చెరువు పోరంబోకును, అటవీ భూమిని ఒక దొంగస్వామి ఆక్రమించి, ఆశ్రమం పేర మోసం చేస్తుంటే, ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవిన్యూ) 2021 ఏప్రిల్ నెలలో ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. దాన్ని అమలు పరచవలసిన బాధ్యత అధికారులపై ఉంది. అమలు పరచకపోతే ఆ నియోజకవర్గ శాసన సభ్యుడు అధికారులను ఎప్పుడు అమలు పరుస్తారని హెచ్చరించాలి. ఈ మధ్య కందుకూరి శాసనసభ్యుడిని హేతువాద సంఘం సభ్యులు కలసి ఇదే విషయమై డిమాండ్ కూడా చేశారు. అలాంటప్పుడు ఒక బాధ్యతాయుతమైన ప్రజా ప్రతినిధి, దొంగ స్వామి ఆక్రమణ భూమి లోకి వెళ్లి పూజలు జరపటం ఎమిటి? ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకిస్తూ, దొంగస్వామి ఆక్రమణకు శాసనసభ్యుడు మద్దతు పలుకుతున్నాడా!! ఒకవేళ మద్దతు పలికితే శాసనసభ్యుడిగా రాజీనామా చేసి ఆ పని చేస్తే బాగుంటుంది. నిజానికి ఇలా చేయటం చాలా సిగ్గుచేటైన విషయం. శాసనసభ్యుడు దొంగలను సపోర్టు చెయ్యకూడదు. వారిని చట్టానికి పట్టించాలి. కనుక ఇప్పటికయినా కందుకూరి శాసనభ్యుడు ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలను అమలుపరచే విధంగా, దొంగస్వామిని అక్కడ నుండి తరిమేసి, ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకొనే చర్యలు చేపట్టాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి హేతువాద సంఘం అధ్యక్షుడు.

అభిప్రాయం

బీమాపై జిఎస్‌టి - బిజెపి విన్యాసాలు



పి. సతీష్



దేశవ్యాప్తంగా ఏఐఐఈఏ (అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం)కి చెందిన యూనిట్లు దాదాపు 300 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి బీమా రంగంపై జిఎస్‌టి భారాన్ని తగ్గించమని వినతి పత్రాలు సమర్పించాయి. బడ్జెట్ సెషన్‌లో అనేకమంది పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్‌లో ఈ అంశం లెవనెత్తినా ప్రభుత్వం వ్యూహాత్మక మౌనం పాటించింది. అయితే, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బీమా రంగంలో విధిస్తున్న 18 శాతం జిఎస్‌టి భారం గురించి ఆర్థిక మంత్రికి ఇటీవల ఒక లేఖ రాశారు. ఈ లేఖలో బీమా ప్రీమియమ్‌పై జిఎస్‌టి విధించడం జీవిత అనిశ్చితిపై పన్ను వేయడమేనని పేర్కొన్నారు. ఇదే కోవలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి కూడా ఆర్థిక శాఖ సహాయ మంత్రికి లేఖ రాశారు. దాంతో బీమాపై మోడీ ప్రభుత్వ విన్యాసాలు చర్చనీయాంశం అయ్యాయి.

జిఎస్‌టి తగ్గింపుకై ఏడేళ్లగా పోరాటం

గత ఏడేళ్లగా అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) బీమా ప్రీమియంపై 18 శాతం పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ స్ఫూర్తిదాయక పోరాటాన్ని కొనసాగిస్తోంది. బీమా రంగంలో జిఎస్‌టి భారాన్ని తగ్గించాలని ఉద్యోగులు, ఏజెంట్లతో కలిసి దేశ వ్యాప్తంగా 46 లక్షల పాలసీదారుల చేత ఆ నాటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి లేఖలు రాయించింది. దాదాపు 400 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి వినతి పత్రాలను సమర్పించింది. అనేక రాష్ట్రాలలో ఉన్న ఆర్థిక మంత్రులను కలిసి ఈ అంశాన్ని జిఎస్‌టి కౌన్సిల్ లో చేపట్టమని అభ్యర్థించింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు యూనియన్ తరపున వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. కేరళ, తమిళనాడు ఆర్థిక మంత్రులు జిఎస్‌టి కౌన్సిల్‌లో ఈ అంశాన్ని లేవనెత్తే ప్రయత్నం చేశారు. అయితే దానికి కేంద్రం అంగీకరించలేదు. గత పార్లమెంట్ లోనూ, ప్రస్తుత పార్లమెంట్ లోనూ అనేకమంది పార్లమెంట్ సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించినా, జిఎస్‌టి కౌన్సిల్‌లో కేంద్ర అనుమతి లేకుండా ఏ ప్రతిపాదన ఆమోదం పొందే అవకాశం లేకపోవడంతో ఈ అంశం అపరిష్కృతంగానే ఉంది.

బీమా రంగాన్ని ప్రోత్సహించాలి

ఆహారం, దుస్తులు, నివాసం తర్వాత, సామాజిక భద్రత ప్రజలకు ముఖ్యమైన అవసరం. సార్వత్రిక భద్రత లోపించిన మన దేశంలో బీమా రంగం ప్రజలకు సామాజిక భద్రత అందించే ముఖ్యమైన సాధనం. కనుక, ప్రభుత్వం బీమా రంగాన్ని ప్రోత్సహించాలి. పన్ను రాయితీలు ఇవ్వడం ద్వారా బీమా పథకాల ద్వారా పొదుపును ప్రోత్సహించాలి. అప్పుడు మాత్రమే బీమా పాలసీలను కొనుగోలు చేయడానికి బీమా చేయదగిన ప్రజలు ఆకర్షితులవుతారు. ఇది దేశంలో ఎక్కువ బీమా వ్యాప్తికి సహాయ పడుతుంది. పాలసీదారు అకాల మరణం సంభవించినప్పుడు అతని కుటుంబానికి అవసరమైన ఆర్థిక భద్రతను అందించడమే కాకుండా, దేశ నిర్మాణ కార్యకలాపాల కోసం ప్రజల దీర్ఘకాలిక పొదుపును పెట్టుబడి పెట్టడంలో ప్రభుత్వానికి సహాయం చేస్తుంది.

జీవిత బీమా ఉత్పత్తులపై జిఎస్‌టి ని నిర్ణయించేటప్పుడు ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందని అందరూ భావించారు. జీవిత బీమా ఉత్పత్తులు, ప్రీమియంలపై అంత పెద్ద మొత్తంలో జిఎస్‌టి విధించడం పాలసీదారులపై భారం మోపడమే అవుతుంది. అంతేగాక వారి పొదుపును నిరుత్సాహ పరుస్తుంది. బీమా పరిశ్రమ వృద్ధికి ఇది ప్రతిబంధకంగా మారింది. దేశంలో అందరికీ సామాజిక భద్రత లేని పరిస్థితుల్లో, బీమా చేయించుకోవడం తప్పనిసరి అవుతుంది. అన్ని నిత్యవసర వస్తువులు, సేవలు జిఎస్‌టి పరిధిలోంచి తప్పిస్తున్న నేపథ్యంలో, బీమా ప్రీమియంపై ఇంత పన్ను భారం మోపడం సహేతుకంగా లేదని ఐఆర్‌డిఏ (బీమా నియంత్రణ సంస్థ) పూర్వ సభ్యులు నీలేష్ సాతే అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా బీమా ప్రీమియం మీద ఇంత పన్ను వేయట్లేదని, యాన్యుటీ పాలసీలపై కూడా ఇంత పన్ను భారమా అని నీలేష్ సాతే వాపోయారు.

విలాస వస్తువులైన బంగారంపై 3 శాతం, నగిషీ చెక్కిన డైమండ్లపై 0.25 శాతం పన్ను విధిస్తూ, ప్రాణాధార మందులు, ప్రాణ వాయువుపై 12 నుండి 18 జిఎస్‌టి భారమా!! ప్రజలకు సామాజిక భద్రత, ఆరోగ్య బీమా సేవలు అందిస్తున్న బీమా రంగంపై 18 శాతం జిఎస్‌టి నా !! ప్రపంచంలో ఏ దేశంలో కూడా సామాజిక భద్రతపై 18 జిఎస్‌టి పన్ను లేదు. ప్రజల పొదుపుపై అధిక జిఎస్‌టి విధించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి!!

31 మార్చి 2023 నాటికి ఎల్ఐసి మన దేశ ఆర్థిక వ్యవస్థలో రూ. 43,97,204.59 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఇందులో రూ. 31,37,315 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో, హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పన కోసం ఎల్ఐసి కేటాయించింది. దేశీయ బీమా రంగంలో ప్రయివేటు బీమా కంపెనీల ప్రవేశం జరిగి 24 ఏళ్ళు అయినా, ఎల్ఐసి ప్రీమియమ్ ఆదాయంలో దాదాపు 60 శాతం మార్కెట్ వాటా, పాలసీలలో 72 శాతం మార్కెట్ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగుతోంది. ఎల్ఐసి ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి ఏటా లక్షల కోట్ల పెట్టుబడులు అందుతున్నాయి. ప్రభుత్వ అంతర్గత నిధుల సమీకరణలో ఎల్ఐసి వాటా 25 శాతం పైబడి ఉంది.

స్విస్ రే' సంస్థ అంచనాల ప్రకారం 2032 నాటికి భారత్ ప్రపంచంలో ఆరవ అతి పెద్ద బీమా మార్కెట్‌గా ఎదగనుంది. 2021లో కోవిడ్ మహమ్మారి దెబ్బకు మన దేశంలో 22.5 శాతం ఆరోగ్య బీమా ప్రీమియమ్‌లు పెరిగాయి. 2022లో ఆర్థిక వ్యవస్థ కోవిడ్ తదనంతర పరిస్థితుల నుంచి కోలుకున్నాక, మోటార్ ప్రీమియమ్‌లు సైతం దాదాపు 2.9 శాతం పైబడి పెరిగాయి. మరి ఆరోగ్య బీమాపై, థర్డ్ పార్టీ ప్రీమియంపై 18 శాతం పన్ను భారం మోపడం, ప్రజలు తమకు తాము కల్పించుకునే సామాజిక భద్రతపై భారం వేయడం కాదా!!

ఇప్పటికైనా మోడీ, బిజెపి అండ్ కో బీమాపై విధించిన జిఎస్‌టి విషయమై చేస్తున్న విన్యాసాలు, ఆడుతున్న నాటకాలు మానుకోవాలి. జిఎస్‌టి భారాన్ని తగ్గించాలి. ప్రభుత్వ బీమా రంగాన్ని ప్రోత్సహించాలి.

/ వ్యాసకర్త సెల్ : 9441797900/

సందర్భం

విధ్వంసం సృష్టించిన రోజు

(హిరోషిమా డే)

రెండవ ప్రపంచ యుద్ధం 1939లో ప్రారంభం అయింది. హిట్లర్, ముస్సోలినీ వంటి నియంతల చర్యల వల్ల రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. ప్రపంచ యుద్ధం ముగుస్తున్న దశలో జపాన్ నగరాలపై అమెరికా అణు బాంబులతో దాడి చేసింది. 1945 ఆగష్టు 6 మానవ చరిత్రలోనే ఒక సామూహిక హింసాకాండ జరిగిన రోజుగా, మహా ప్రళయం సృష్టించిన రోజుగా, మానవత్వమే సిగ్గుతో తల దించుకున్న రోజుగా చరిత్రలో నిల్చింది. 1945 ఆగష్టు 6వ తేదీన జపాన్ మీద కక్షతో హిరోషిమా నగరంపై అమెరికా ఆటంబాంబును జారవిడిచింది. దాని ప్రభావంతో దాదాపు లక్షలాది జనం చనిపోయారు. ఎందరో రేడియేషన్ ప్రభావానికి గురై అంగవైకల్యం పొందారు. పచ్చదనం కూడా కనుమరుగైపోయింది. భవనాలన్నీ నేలమట్టం అయిపోయాయి. అంతా శ్మశాన వాతావరణం నెలకొంది. చేయని నేరానికి అమాయక ప్రజలెందరో బలైపోయారు. చరిత్రలో ఈ భయానక ఘటన హిరోషిమా డే నిలిచిపోయింది.

- యం.రాంప్రదీప్,
తిరువూరు.

రాజ్యాంగ ప్రవేశిక తొలగింపు

- 3, 6 తరగతుల పాఠ్య పుస్తకాలపై ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయం
- కేంద్రంపై విద్యావేత్తల ఆగ్రహం

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ ప్రవేశిక మన దేశాన్ని సర్వసత్తాక, సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా ప్రకటించింది. దేశంలో నివసించే పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం లభించేలా చూడడమే దీని లక్ష్యం. దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడాలని, ప్రజల మధ్య సోదర భావాన్ని పెంపొందించాలని రాజ్యాంగ ప్రవేశిక కోరుకుంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ప్రవేశిక ఎన్‌సిఇఆర్‌టి ఈ ఏడాది జారీ చేసిన 3, 6 తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలలో కనిపించడం లేదు. ప్రధాన సబ్జెక్టులైన భాషలు, లాంగ్వేజ్, పర్యావరణ అధ్యయనాలు (ఇవిఎస్) వంటి కొన్ని పాఠ్య పుస్తకాల నుండి రాజ్యాంగ ప్రవేశికను తొలగించారు. ఎన్‌సిఇఆర్‌టి 2005-06, 2006-07 మధ్య అన్ని తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలను ప్రచురించింది. ఎన్‌డిఎ ప్రభుత్వం 2020లో నూతన విద్యావిధానాన్ని తీసుకురావడంతో ప్రస్తుతం ఎన్‌సిఇఆర్‌టి ఆ పుస్తకాలను సవరిస్తోంది. ఈ సంవత్సరం 3, 6 తరగతుల కోసం నూతన పాఠ్యపుస్తకాలను విడుదల చేసింది.

6వ తరగతి పుస్తకాల్లో...

6వ తరగతికి సంబంధించిన పాత హిందీ, ఇంగ్లీష్, సైన్స్, ఇవిఎస్ పాఠ్య పుస్తకాలలోని మొదటి పేజీల్లో ప్రవేశికను ముద్రించారు. కొత్త పుస్తకాలలో హిందీ, సైన్స్ పుస్తకాలలో ప్రవేశిక కనిపించింది. పర్యావరణ అధ్యయనాల్లో గతంలో మూడు పుస్తకాలుండగా, ఇప్పుడు ఒక పుస్తకాన్నే ముద్రించారు. దీనిలో కూడా ప్రవేశిక లేదు. గణిత పుస్తకం అందుబాటులోకి రాలేదు. కొత్త ఆంగ్ల పుస్తకంలో జాతీయ గీతం మాత్రమే ఉండగా, సంస్కృత పుస్తకంలో దానితో పాటు వందేమాతర గీతం కూడా ఉంది. కానీ ప్రవేశిక లేదు.

3వ తరగతి పుస్తకాల్లో...

3వ తరగతి పాఠ్య పుస్తకాల విషయానికి వస్తే హిందీ, ఇంగ్లీష్, గణితం, ఇవిఎస్ స్థానంలో తీసుకొచ్చిన వరల్డ్ అరౌండ్ అజ్ పుస్తకాలలో దేనిలోనూ ప్రవేశికను ముద్రించలేదు. పాత ఇవిఎస్ పుస్తకం లుకింగ్ అరౌండ్, హిందీ పుస్తకంలో మాత్రం ప్రవేశిక ఉన్నాయి.

ప్రభుత్వం భయపడుతోంది

ప్రవేశిక అనేది రాజ్యాంగానికి సూక్ష్మ రూపమని, జాతీయ గీతం, జాతీయ పాట, ప్రాథమిక హక్కులు, విధులు అది లేని లోటును భర్తీ చేయలేవని ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ మాజీ అధ్యాపకురాలు నందితా నారాయణ్ తెలిపారు. ప్రవేశికను ఎందుకు తొలగించారో ఎన్‌సిఇఆర్‌టి వివరణ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. 'బిజెపి ప్రభుత్వం ప్రవేశికను చూస్తే భయపడుతోంది. ఎందుకంటే స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి రాజ్యాంగంలోని కీలకమైన విలువలను అది చాటిచెబుతోంది. ఈ ప్రభుత్వం ఆ విలువలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. అందుకే అనేక పుస్తకాల నుండి ప్రవేశిక తొలగించారు' అని నందితా నారాయణ్ చెప్పారు.

ప్రవేశిక — భారత రాజ్యాంగం

భారత ప్రజలమైన మేము భారత దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర, రాజ్యంగా నిర్మించుకోవడానికి పౌరులందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల్లో స్వతంత్రతను, అంతస్థుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చడానికి, వారందరిలో వ్యక్తి గౌరవాన్ని జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి 1949, నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్‌లో ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము ఇచ్చుకుంటున్నాం.

ఒబిసిల్లో 77 కులాల చేర్పుపై వివరణ

- పశ్చిమ బెంగాల్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : రాష్ట్ర ఒబిసి జాబితాలో 77 కులాలను చేర్చడంపై వివరణ ఇచ్చేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం అవకాశం ఇచ్చింది. అనేక కులాలను ఒబిసి జాబితాలో చేర్చడాన్ని కొట్టివేస్తూ మే 22న కొల్‌కత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ పిటీషన్‌ను ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఒబిసి కులాలను గుర్తించడానికి చేపట్టిన సర్వే స్వభావం, పరిధిని స్పష్టం చేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనేక కులాలను ఒబిసిలో చేర్చే సమయంలో బిసి కమిషన్‌తో అర్థవంతమైన సంప్రదింపులు జరపలేదని హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై కూడా స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రిజర్వేషన్ల ప్రయోజనం కోసం ఈ కులాలను ఉపవర్గీకరణ చేసేటప్పుడు చర్చలు జరిగాయా? లేదా? అనే వివరాలను స్పష్టం చేయాలని కోరింది.

బ్రిటన్‌లో చెలరేగిన హింస

- వలస వ్యతిరేక ఆందోళనలతో అట్టుడుకుతున్న లండన్

లండన్ : బ్రిటన్‌వ్యాప్తంగా వారాంతంలో హింస చెలరేగింది. లివర్‌పూల్, హల్, నాటింగ్‌హం, ఇతర నగరాల్లో ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. వలస వ్యతిరేక ఆందోళనలతో దేశం అట్టుడుకుతోంది. నిరసనకారులు భవనాలకు, దుకాణాలకు నిప్పంటించారు. దుకాణాలు లూటీ చేశారు. గత 13ఏళ్ల కాలంలో ఇంత తీవ్ర స్థాయిలో అల్లర్లు, ఘర్షణలు, హింస చెలరేగడం ఇదే. ఉత్తర ప్రాంత పట్టణమైన సౌత్‌పోర్ట్‌లో గత నెల 29న కత్తిపోట్ల దాడిలో ముగ్గురు బాలికలు మరణించిన ఘటనలో దాడికి దిగిన వ్యక్తి జాతీయతపై ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడంతో ఈ అల్లర్లు చెలరేగాయి. దేశంలో పెరుగుతున్న వలసల వ్యతిరేక ఆందోళనలే ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా వుంది. దీనికి తోడు ప్రస్తుతం బ్రిటన్ ఎదుర్కొంటున్న వివిధ వ్యవస్థాగత సంక్షోభాలు, మందకొడిగా వున్న ఆర్థిక వ్యవస్థ కూడా ఇందుకు దోహదపడుతున్నాయి. కత్తిపోట్ల దాడికి పాల్పడిన 17 ఏళ్ల యువకుడు గతేడాది బోటు ద్వారా బ్రిటన్‌లోకి వచ్చాడని, ఇక్కడ శరణార్థిగా వుంటున్నాడంటూ సమాచారం ఆన్‌లైన్‌లో వూపందుకుంది. పైగా ముస్లిం శరణార్థి అంటూ తొలుత పేర్కొన్నా తర్వాత అది తప్పని గుర్తించారు. ఆ దుండగుడి జాతీయతపై ఊహాగానాలు వెల్లువెత్తుతుండడంతో కోర్టు ఆ వ్యక్తి జాతీయత వెల్లడిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. ఆ వ్యక్తిని ర్వాండా జాతీయుడిగా పేర్కొంది.

గుజరాత్‌లో భారీ వర్షాలు

- ఉప్పొంగుతున్న నదులు

అహ్మదాబాద్ : గుజరాత్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా నవసరి, వల్సాద్, డాంగ్స్, తాపీ జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక నదులు ఉప్పొంగుతున్నాయి. లోతట్టు ప్రాంతాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు సోమవారం తరలించారు. నవసరి జిల్లాలోని ఖేర్గాం తాలుకాలో సోమవారం ఉదయం 6 గంటల వరకూ గత 24 గంటల్లో 229 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. వల్సాద్ జిల్లాలోని ధరంపూర్, వల్సాద్ తాలూకాల్లో 185 మిల్లీమీటర్లు, 180 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దక్షిణ జిల్లాల్లోని మొత్తం 12 తాలూకాల్లో గత 24 గంటల్లో 100 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఔరంగ్ నది ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తోంది. అలాగే కావేరి, అంబికా నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అలాగే వల్సాద్ జిల్లాలో ఒక చెరువులో చిక్కుకున్న ఏడుగురు కూలీలను ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించారు.

ఈ రుతుపవనాల సీజన్‌లో గుజరాత్‌లో ఇప్పటి వరకూ మొత్తం సగటు వర్షపాతంలో 67 శాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయింది.

టిడిపి ఆఫీసుపై దాడి కేసులో వైసిపి నేతలకు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన కేసులో అరెస్టయిన గుంటూరు వైసిపి నేతలకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.15 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలి. చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు ప్రతినెలా 1, 15వ తేదీల్లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలి. తదితర షరతులను విధించింది. పిటిషనర్లు నెలకు పైగా జైల్లో ఉన్నారని గుర్తు చేసింది. ఇదే కేసులో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపి నందిగం సురేష్, దేవినేని అవినాష్, పలువురు కార్యకర్తలు ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 8కి వాయిదా పడింది.


సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

శాంతి భద్రతల పట్ల అప్రమత్తం

- అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాంతి భద్రతల అంశంలో అప్రమత్తంగా వుండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఎంతటి వారినైనా ఉపేక్షించొద్దని అన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేస్తామంటే సహించబోమని ఆగ్రహించారు. సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో ఆయన హోంశాఖపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిపి ద్వారకా తిరుమలరావు.. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, క్రైమ్, విజిబుల్ పోలీసింగ్ అంశాలపై ముఖ్యమంత్రికి వివరించారు. 2018 నుంచి 2024 మధ్య గంజాయి కేసులు 122 శాతం పెరిగాయని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను తగ్గించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గుర్తించిన బ్లాక్ స్పాట్లను ప్రజలకు వివరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. నేర నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకుంటామని వివరించారు. సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల కాలంలో పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. రాష్ట్రంలో 14 వేల సిసి కెమెరాలు పనిచేస్తున్నా అందులో డేటాను తీసుకుని నేర నియంత్రణ చేయడంలో విఫలం చెందిందన్నారు. రోడ్లపైన, సినిమా థియేటర్లు, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సైబర్ నేరాలపైనా దృష్టి సారించాలన్నారు. గత ఐదేళ్లలో జరిగిన తప్పులను వెలికి తీసి, చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి నాయకులు తప్పు చేసినా ఉపేక్షించబోమని అన్నారు. మదనపల్లె ఆర్‌డిఒ కార్యాలయం దగ్ధం కేసును కేస్ స్టడీగా తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల నిర్వహణపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. మద్యం పాలసీని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తున్నామని తెలిపారు.

గాజాలో గత 24గంటల్లో 40మంది పాలస్తీనియన్ల మృతి

- ఇజ్రాయిల్‌ను శిక్షించక తప్పదన్న ఇరాన్

గాజా : గత 10మాసాలుగా గాజాలో ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతునే వున్నాయి. ఇప్పటివరకు గాజాలో 39,623మంది మరణించగా, 91,469మంది గాయపడ్డారు. తాజాగా గత 24గంటల్లో గాజావ్యాప్తంగా 40మంది మరణించగా, 71మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండానే, ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశించకుండానే శరణార్థుల శిబిరాలపై బాంబులు జరుపుతున్నారని బాధితులు వాపోయారు. ఖాన్‌యూనిస్‌లోని నిరాసిత శిబిరంలో తన కుటుంబం ఉంటున్న గుడారంపై ఇజ్రాయిల్ ట్యాంకులు దాడి చేశాయని, తన కుటుంబ సభ్యులు చనిపోయారని బాధిత మహిళ ఒకరు కన్నీరు పెట్టుకున్నారు. తాజాగా ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో పాలస్తీనా ఆర్థికశాఖ అండర్ సెక్రటరీ అబ్దుల్ ఫతా అల్‌జారాయి చనిపోయారని మిలటరీ ధ్రువీకరించింది. హమాస్ పొలిటికల్ బ్యూరో చీఫ్ హనియె హత్య నేపథ్యంలో ఇజ్రాయిల్‌పై ప్రతీకార చర్యలు తప్పవని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో, ప్రాంతీయ ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం తమ అభిమతం కాదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి నాసర్ కనాని చెప్పారు. మరింత అస్థిరత నెలకొనకుండా చూడాలంటే ఇజ్రాయిల్‌ను శిక్షించడం తప్పనిసరని నమ్ముతున్నట్లు తెలిపారు. టెహరాన్‌లో హనియెను హత్య చేయడం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన కిందకే వస్తుందని అన్నారు. తమ దేశభద్రత, సార్వభౌమాధికారాలను రక్షించుకునే హక్కు ఇరాన్‌కు వుందన్నారు. ఇజ్రాయిల్‌ను దారిలో పెట్టేందుకు, నేరాలు చేయకుండా నిలువరించేందుకు శిక్షించే హక్కు కూడా ఇరాన్‌కు వుందని చెప్పారు. ఇప్పటివరకు గాజాకే పరిమితమైన ఈ దాడులు విస్తృత ఘర్షణలు, అల్లర్లకు దారి తీసే ప్రమాదముందని భావిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఎంసిడికి సభ్యులను నామినేట్ చేయవచ్చు

- లెఫ్టినెంట్ గవర్నరుకు ఆ హక్కు ఉంది
- ఢిల్లీ ప్రభుత్వ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నైపుణ్య పరిజ్ఞానం కలిగిన వ్యక్తులను ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసిడి)కి నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు ఉన్నదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అందుకు మంత్రిమండలి సహాయం కానీ, సలహా కానీ అవసరం లేదని తేల్చిచెప్పింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ జెబి పార్దివాలాతో కూడిన బెంచ్ సోమవారం తీర్పు వెలువరించింది. 1957వ సంవత్సరపు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టానికి 1993లో తొలిసారి చేసిన సవరణ ద్వారా ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన వ్యక్తులను నామినేట్ చేసే చట్టబద్ధమైన అధికారం లెఫ్టినెంట్ గవర్నరుకు సంక్రమించిందని న్యాయస్థానం తెలిపింది. మంత్రిమండలిని సంప్రదించకుండా పది మందిని ఎంసిడికి నామినేట్ చేస్తూ గత ఏడాది జనవరి 1, 4 తేదీల్లో లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా జారీ చేసిన ఆదేశాలు, నోటిఫికేషన్లను కొట్టివేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. నియామకాల విషయంలో మంత్రిమండలి సాయం, సలహా తీసుకునేలా లెఫ్టినెంట్ గవర్నరును ఆదేశించాలని కోరింది. ఈ అభ్యర్థనను న్యాయస్థానం అంగీకరించలేదు. 2022 డిసెంబరులో జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. దీంతో పదిహేను సంవత్సరాల బిజెపి పాలనకు తెరపడింది. ఎన్నికల్లో ఓడిపోయినా దొడ్డిదారిన అధికారాన్ని చేజిక్కించుకునేందుకు తనకు అనుకూలురైన పది మంది సభ్యులను లెఫ్టినెంట్ గవర్నరుతో నామినేట్ చేయించింది.

సిఐడి జప్తు భూమి అన్యాక్రాంతమైందని పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

ఉమ్మడి కృష్ణా జిల్లా, అంబాపురం గ్రామ సర్వే నెంబర్ 88లో సిఐడి జప్తు చేసిన అగ్రిగోల్డ్ భూమి అన్యాక్రాంతం అయినప్పటికీ ఆఫీసర్లు పట్టించుకోవడం లేదని అగ్రిగోల్డ్ యజమాన్యం హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై సమగ్ర వివరాలు అందజేయాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ప్రకటించారు.

ప్రజాస్వామ్యానికి ప్రాణంపోసి..

కుట్రలకు బలై

ధాకా : షేక్ హసీనా వాజెద్.. బంగ్లాదేశ్ ఉక్కుమహిళగా పేరుపొందిన మాజీ ప్రధాని. అనూహ్యంగా పదవికి రాజీనామా చేసి దేశం నుంచి వెళ్లిపోయిన ఆమె బంగ్లాదేశ్ రాజకీయాల్లో దాదాపు మూడు దశాబ్దాలు తనదైన ముద్రవేశారు. హసీనా రాజకీయ జీవితం అంత సాఫీగా జరగలేదని మాత్రం చెప్పవచ్చు.

బంగబంధు కుమార్తెగా..

హసీనా తండ్రి ముజిబర్ రహ్మాన్‌కు బంగబంధుగా పేరుంది. బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని భారత్ సాయంతో పూర్తిచేశారు. అనంతరం 1975లో ఆయన అధికార నివాసంలో ఉండగా సైన్యం దాడి చేసి ఆయనతో సహా ఇంట్లో వారిని చంపేసింది. రహ్మాన్‌తో సహా ఆ కుటుంబంలో మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో హసీనా, ఆమె సోదరి రెహానా జర్మనీలో ఉండటంతో బతికిపోయారు. మిలటరీ పదఘట్టనల కింద నలిగిపోయిన దేశంలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేందుకు నిరంతరం పోరాటం చేశారు.

ఏకంగా 19 సార్లు హత్యాయత్నాలు..

ఆమెపై ఏకంగా 19 సార్లు హత్యాయత్నాలు జరగడం గమనార్హం. జనరల్ ఎర్షద్, అనంతరం బేగం ఖలీదా జియా పాలనా కాలంలో పలుమార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయితే అన్నింటినుంచి ఆమె సురక్షితంగా బయటపడ్డారు. బాంబులు అమర్చడం, కిరాయి హంతకులను వినియోగించడం, విషప్రయోగం, ర్యాలీలపై భద్రతాదళాల కాల్పులు.. ఇలా ప్రత్యర్థులు ఆమెను చంపేందుకు యత్నించారు. అయితే అనేక సందర్భాల్లో కార్యకర్తలే ఆమెకు భద్రతాకవచంలాగా ఏర్పడి కాపాడుకున్నారు.

ఇటీవలే జరిగిన ఎన్నికల్లో ఆమె పార్టీ అవామీలీగ్ విజయం సాధించింది. దీంతో సుదీర్ఘకాలం బంగ్లాను పాలించిన నేతగా రికార్డు సృష్టించారు. అయితే దేశంలో అతివాద శక్తులు బలపడటం, ప్రతిపక్షాలు తెరచాటు వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహించారు. చివరకు రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలో విద్యార్థులకు తోడుగా ఆమె వ్యతిరేకులందరూ హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడటంతో రాజీనామా అనివార్యమైంది.



యుక్తవయస్సులో షేక్ హసీనా

బంగ్లాదేశ్ మరో పాకిస్తాన్‌లా మారుతుంది

- హసీనా కుమారుడు జోయ్



ధాకా: షేక్ హసీనా కుమారుడు ప్రధాని సలహాదారు అయిన నజీబ్ వాజెద్ జోయ్ దేశంలో చోటుచేసుకున్న హింసాత్మక నిరసనలను ఖండించారు. హసీనా రాజకీయంగా పునరాగమనం ఇక ఉండకపోవచ్చని సోమవారం నాడు బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అన్నారు. తన తల్లి ఎంతో కష్టపడి పనిచేశారని, మైనార్టీలు ఎదురు తిరగడం ఆమెను నిరాశపరిచిందని అన్నారు. హసీనా నేతృత్వంలో దేశం సాధించిన పురోభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిందని, మధ్యంతరంగా ఎన్నుకోబడని ప్రభుత్వం ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ మరో పాకిస్తాన్‌లా మారుతుందని జోయ్ అన్నారు. "ప్రజలను, ఈ దేశాన్ని సురక్షితంగా ఉంచడం మీ బాధ్యత. ఎన్నిక కాని ప్రభుత్వం అధికారంలో కూర్చోవడానికి ఒక్క నిమిషం కూడా అనుమతించొద్దు. ప్రధానిని గద్దె దించితే మన సాధించిన అభివృద్ధి అంతా మట్టిలో పోసినట్టవుతుంది. తిరిగిమళ్లీ పుంజుకోలేదు. మనం అలాంటి పరిస్థితిని కోరుకోం" అని జోయ్ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు.



బంగ్లా పరిణామాలు..
ప్రధాని మోడీ అధ్యక్షతన అత్యవసర భేటీ

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలిస్తుంది. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సోమవారం సాయంత్రం అత్యవసరంగా భేటీ అయ్యింది. పొరుగు దేశంలో తాజా పరిస్థితులు, స్థానికంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమీక్ష జరిపినట్లు సమాచారం. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, నిర్మలా సీతారామన్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోడీకి భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ వివరించారు. అంతకుముందు ఢిల్లీకి సమీపంలోని హిండన్ ఏయిర్‌బేస్‌లో దిగిన షేక్ హసీనాతో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ భేటీ అయ్యారు.

మరోవైపు, బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు, హసీనా రాజీనామా నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో ఈ భేటీ జరిగింది. బంగ్లాదేశ్ తాజా పరిస్థితులపై ఇరువురు చర్చించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు..

బంగ్లాలో ఏం జరిగింది?

ధాకా: బంగ్లాదేశ్‌లో గత 24గంటల్లో పరిణామాలు వేగంగా మారిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రతిపాదిత రిజర్వేషన్ కోటాతో మొదట బయల్దేరిన ఆందోళన, ప్రధాని రాజీనామా కోసం పట్టుబట్టే దాకా వెళ్లింది. 1971 బంగ్లా విముక్తి కోసం పోరాడిన సైనికుల కుటుంబాలకు రిజర్వేషన్లు రద్దు చేయాలన్న ప్రభుత్వ అప్పీలును సుప్రీం కోర్టు సమర్థిస్తూ తీర్పు వెలువరించిన తరువాత వివాదం సద్దుమణిగిపోతుందని అందరూ భావించారు. కానీ, అలా జరగలేదు. జైలులో ఉన్న వారిని విడుదల చేయాలన్న డిమాండ్‌ను ముందుకు తెచ్చారని, దానికి ప్రభుత్వం నిరాకరించడంతో సహాయ నిరాకరణకు దిగారని పశ్చిమ దేశాల మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. అయితే, ప్రధాని రాజీనామా కోసం ఆందోళనకారులు పట్టుబట్టేంత బలమైన కారణమేదీ లేదని, ఇది కచ్చితంగా బయటి శక్తుల ప్రమేయంతో జరిగిన రాజకీయ ప్రేరేపిత ఉద్యమం అని పరిశీలకులు పేర్కొంటున్నారు. పాలస్తీనాలో వివిధ గ్రూపుల మధ్య సయోధ్య కుదుర్చుతూ చైనా ఇటీవల చూపిన చొరవ పశ్చిమాసియాలో పలువురి ప్రశంసలందుకుంది. ఈ పరిణామంతో ఉలిక్కిపడ్డ అమెరికా, దాని మిత్ర దేశమైన ఇజ్రాయిల్ హిజ్బుల్లా, హమాస్ నేతల హత్య గావించింది. ఇప్పుడు బంగ్లా దేశ్‌లో తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చైనా వ్యతిరేక వ్యూహానికి పదును పెట్టాలని చూస్తోంది. మిలటరీ ప్రస్తుతం పరిస్థితులను తమ చేతుల్లోకి తీసుకుందని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ ప్రకటించారు. స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్ స్పందిస్తూ, ఆందోళన చేస్తున్న విద్యార్థులు, పౌరులతో చర్చలు జరిపిన తర్వాతనే అధికారం బదలాయింపు జరగాలని పేర్కొన్నారు.

షేక్ హసీనా రాజకీయ ప్రస్థానం

- దేశ రాజకీయాల్లో.. ఆమే కీలక నేత

షేక్ హసీనా బంగ్లాదేశ్ పాలక పార్టీ అవామీ లీగ్ నాయకురాలు మాత్రమే కాదు బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు, బంగ బంధుగా పిలువబడే షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె. ప్రపంచంలో అత్యంత ఎక్కువ కాలం ప్రభుత్వాధినేతగా వ్యవహరించిన మహిళగా హసీనా పేరొందారు. ఆమె 1996 నుంచి 2001 మధ్య.. అనంతరం 2009 నుంచి తాజాగా రాజీనామా చేసేవరకూ బంగ్లాదేశ్‌ను పరిపాలించారు. ఆమె 1960లో ఢాకా విశ్వవిద్యాలయంలో ఉన్నప్పటికే హసీనా రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. 1968లో ప్రముఖ శాస్త్రవేత్త ఎంఎ వాజెద్ మియాను హసీనా వివాహమాడారు.

బంగ్లాదేశ్ తొలి అధ్యక్షునిగా ముజిబుర్ రెహ్మాన్ ఎన్నికయ్యారు. అయితే అధ్యక్ష పదవి చేపట్టిన కొన్ని నెలలకే 1975 ఆగస్టు 15న ముజిబుర్ రెహ్మాన్ సైన్యం చేతిలో హత్యకు గురయ్యారు. ఆయనతోపాటు హసీనా తల్లిని, ముగ్గురు సోదరులను కొందరు సైనికాధికారులు ఇంట్లోనే హత్య చేశారు. ఈ హత్యలు జరిగినప్పుడు ఆమె బంగ్లాదేశ్‌లో లేరు. అప్పట్లో హసీనా ఆరేళ్ల ప్రవాసంలోనే ఉన్నారు. ఆ సమయంలోనే అవామీ లీగ్ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు.

1981లో ఆమె బంగ్లాదేశ్ తిరిగి వచ్చాక రాజకీయాల్లో కీలక నాయకురాలిగా మారారు. ఆ సమయంలో కొన్నిసార్లు గృహనిర్బంధానికి గురయ్యారు. 1990 డిసెంబర్‌లో ప్రజల ఒత్తిడికి తలొగ్గిన బంగ్లాదేశ్ చివరి సైనిక పాలకుడు లెఫ్టినెంట్ జనరల్ మొహ్మద్ ఎర్షాద్ రాజీనామా చేశారు. 1991లో జరిగిన ఎన్నికల్లో హసీనా పార్టీకి మెజారిటీ లభించలేదు. ఆమె ప్రత్యర్థి ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) విజయంసాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఐదేళ్లకు 1996లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించడంతో హసీనా తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు.



2004లో గ్రనేడ్ దాడి నుంచి బయటపడి..

1996 జూన్‌లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ విజయం సాధించి, హసీనా ప్రధానమంత్రి అయ్యారు. 2001 అక్టోబరులో జరిగిన ఎన్నికల్లో ఖలీదా జియా నేతృత్వంలోని బీఎన్‌పీ, మూడు సంకీర్ణ భాగస్వామ్య పక్షాల చేతిలో అవామీ లీగ్ ఓడిపోయింది. అనంతరం 2004 ఆగస్టులో దేశ రాజధాని ఢాకాలో అవామీ లీగ్ ర్యాలీపై జరిగిన గ్రనేడ్ దాడిలో 22 మంది మృతి చెందారు. ఆ దాడి నుంచి హసీనా బయటపడ్డారు.

2008 డిసెంబరులో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 300 స్థానాలకుగాను 250కి పైగా స్థానాల్లో హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ జయకేతనం ఎగరవేసింది. 2009 జనవరిలో మరోసారి ప్రధానిగా హసీనా ప్రమాణం చేశారు. 2014 జనవరిలో సార్వత్రిక ఎన్నికలను బీఎన్‌పీ బహిష్కరించింది. దీంతో హసీనా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2024 జనవరిలో మళ్లీ బంగ్లాదేశ్ ప్రధానిగా షేక్ హసీనా ఎన్నికయ్యారు.

హసీనా-భారత్ సంబంధాలు

ముజిబుర్ రెహ్మాన్ హత్యకు గురైన తర్వాత షేక్ హసీనాకు, ఆమె కుటుంబానికి భారత్ ఆశ్రయమిచ్చింది. అప్పట్లో ఢిల్లీలో షేక్ హసీనా కుటుంబం ఆశ్రయం పొందిన విషయాన్ని పూర్తిగా రహస్యంగా ఉంచారు. కానీ షేక్ హసీనా కుటుంబం ఢిల్లీలో ఉన్న సంగతి బంగ్లాదేశ్ ప్రభుత్వానికి తెలుసని చరిత్రకారులు చెబుతారు. తొలిసారి 1996లో షేక్ హసీనా బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవిని చేపట్టిన నాటి నుంచి భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు మరింత బలపడ్డాయి. 2022లో భారత్ వచ్చిన సమయంలో హసీనా మాట్లాడుతూ, 'బంగ్లాదేశ్ ఎన్నటికీ భారత్‌ను మర్చిపోదు' అని అన్నారు. 1971 స్వాతంత్ర్యోద్యమ సమయంలో భారత ప్రభుత్వం, సైనికదళం, భారత ప్రజలు తమ పక్షాన నిలబడ్డారని గుర్తుచేసుకున్నారు. 2009లో షేక్ హసీనా అధికారం చేపట్టాక.. బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి ఈశాన్య భారత రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగించే తిరుగుబాటు సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించారు. అలా తన నిర్ణయాలతో విశ్వాసాన్ని చూరగొన్నారు షేక్ హసీనా.



ఢాకాలో అల్లర్ల దృశ్యం

బిఎస్‌ఎఫ్ హైఅలర్టు

న్యూఢిల్లీ : పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో భారత సైన్యం అప్రమత్తమైంది. భారత్- బంగ్లా సరిహద్దులో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్‌ఎఫ్) హైఅలర్ట్ ప్రకటించింది. భారత్-బంగ్లాదేశ్ మధ్య 4, 096 కిలోమీటర్ల సరిహద్దు ప్రాంతం ఉన్న నేపథ్యంలో అదనపు బలగాలను మోహరించాలని, కమాండర్లందరూ సరిహద్దులోనే ఉండాలని సూచించినట్లు సీనియర్ అధికారులు తెలిపారు. బిఎస్‌ఎఫ్ సిబ్బందికి సెలవులను రద్దు చేశారు. తాజా పరిస్థితులను సమీక్షించేందుకు ఇప్పటికే బీఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ ఛౌదరి కోల్‌కత్తాకు చేరుకున్నారు.

ప్రధాని నివాసం లూటీ : నిరసనకారులు ప్రధాని అధికారిక నివాసమైన గణభాబన్‌ను ముట్టడించి, అక్కడ విధ్వంసం సృష్టించారు. విలువైన వస్తువుల్ని లూటీ చేసినట్లు స్థానిక మీడియా ప్రసారం చేస్తోన్న దృశ్యాల్లో కనిపిస్తోంది. చికెన్, ఫిష్, కూరగాయలు, ఫర్నీచర్, ఇతర విలువైన వస్తువులు పట్టుకుపోయినట్లు పేర్కొన్నాయి.

హోం, రక్షణ శాఖలపై చర్చ జరపాలి

- రాజ్యసభలో ప్రతిపక్షాలు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హోం, రక్షణ శాఖలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం రాజ్యసభలో పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ, వ్యవసాయ మంత్రిత్వ శాఖ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర హోం, రక్షణ మంత్రిత్వశాఖలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఆ రెండు శాఖలు చాలా ముఖ్యమైనవని, వాటిపై చర్చ అవసరమని డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌ను రాజ్యసభ ఛైర్మన్ తిరస్కరించారు. రాజ్యసభలో రైతులు పండించే పంటలకు ఎంఎస్‌పి చట్టం చేయాలని, రుణమాఫీ చేయాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. ఎరువులు, విత్తనాల సబ్సిడీ పెంచాలని, నాణ్యమైన విత్తనాలివ్వాలని సూచించారు. రైతుల ఆత్మహత్యలను నియంత్రించాలని కోరారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. 'మేము కిసాన్ సమ్మాన్ నిధి గురించి చర్చిస్తున్నాం. రైతులకు ప్రత్యక్ష సహాయం గురించి కాంగ్రెస్ మాట్లాడింది. కానీ కాంగ్రెస్ ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాన్ని ఎప్పుడూ చేయలేదు. మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ పథకాన్ని రూపొందించారు. వారికి (ప్రతిపక్షం) అర్థం కాదు. చిన్న రైతులకు రూ.6 వేలు అందుతుంది. ఈ కిసాన్ సమ్మాన్ నిధి వల్ల రైతులు స్వావలంబన పొందారు. ప్రతిపక్షాలు రైతుల గౌరవాన్ని చూడలేవు' అని అన్నారు.

మత్స్యకార, రైతులకు ఆదాయ భద్రత కల్పించాలి

లోక్‌సభలో కేంద్ర ఫిషరీస్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వశాఖ, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై చర్చ జరిగింది. టిఎంసి ఎంపి సయానీ ఘోష్ మాట్లాడుతూ.. దేశంలో పశుగ్రాసం సంక్షోభాన్ని ఎత్తిచూపారు. జాతీయ పశుగ్రాసం కొరత ఉందని కేంద్ర మంత్రి గుర్తించారని, ప్రభుత్వ ఆధీనంలోని గోశాలలో, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆవులు ఆహారం లేకపోవడంతో చనిపోవడం ఆందోళన కలిగిస్తోందని ఆమె ఎత్తిచూపారు. కాంగ్రెస్ ఎంపి బెన్నీ బెహనాన్ మాట్లాడుతూ.. మత్స్యకార, రైతు సంఘాలకు మద్దతు ఇవ్వాలని, ఆదాయ భద్రత కల్పించాలని కోరారు. ఈ కమ్యూనిటీలను రక్షించడానికి సకాలంలో, తగిన పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. తీర ప్రాంత పర్యాటక కార్యక్రమాలను కూడా విమర్శించారు. అవి సముద్ర పర్యావరణ వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నాయని, మత్స్యకారుల జీవనోపాధిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.

ఆర్టికల్ 370 రద్దు ఒక 'నల్ల చట్టం'

ఐదేళ్ల క్రితం జరిగిన ఆర్టికల్ 370 రద్దును నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపి సయ్యద్ రుహుల్లా మెహదీ తీవ్రంగా ఖండించారు. ఈ చర్యను 'నల్ల చట్టం'గా అభివర్ణించారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ దీనిని ద్రౌపతి వస్త్రాపహరణంతో పోల్చారు. జమ్ము కాశ్మీర్ గౌరవం, స్వయం ప్రతిపత్తిని కోల్పోయినందుకు ప్రభుత్వం నవ్వుతోందని అన్నారు. మెహదీ వ్యాఖ్యలపై కేంద్ర సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ స్పందించారు. ఆయన వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేశారు. మెహదీ వ్యాఖ్యలను అధికారిక రికార్డు నుండి తొలగించాలని లోక్‌సభ ప్యానల్ స్పీకర్ జగదాంబికా పాల్ సూచించారు.

కేరళలో ఎందుకు ఎయిమ్స్ పెట్టరు?

కేరళలో ఎందుకు ఎయిమ్స్ పెట్టరని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ మంత్రి జెపి నడ్డాను ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ.. 'కేరళకు ఎయిమ్స్ సౌకర్యం కల్పిస్తామని కేంద్ర మంత్రి జెపి నడ్డా గతంలోనే హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా అనేక ఎయిమ్స్ మంజూరు చేసినప్పటికీ కేరళను పట్టించుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం 22 ఎయిమ్స్ ప్రాజెక్టులను ఆమోదించింది. కేరళను ఎందుకు చేర్చలేదు' అని ప్రశ్నించారు.

గోవా అసెంబ్లీలో ఎస్‌టి సీట్ల రిజర్వ్ బిల్లు

గోవా శాసనసభలో షెడ్యూల్డ్ తెగలకు సీట్లను రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన బిల్లును కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

ఆర్టికల్ 370 రద్దుతో జమ్ము కాశ్మీర్, లడఖ్ పురోగతి : ప్రధాని మోడీ

ఆర్టికల్ 370 రద్దుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. 'మన దేశ చరిత్రలో కీలకమైన ఆర్టికల్ 370, 35(ఎ)లను పార్లమెంటు రద్దు చేసి నేటికి ఐదేళ్లు పూర్తయింది. ఈ నిర్ణయం జమ్ము కాశ్మీర్, లడఖ్ పురోగతి, శ్రేయస్సుకు సంబంధించి కొత్త శకానికి నాంది పలికింది. జమ్మూకాశ్మీర్, లడఖ్ ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాబోయే సంవత్సరాల్లో వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని నేను హామీ ఇస్తున్నాను' అని పేర్కొన్నారు.

సహారా డబ్బులు వాపస్‌పై జోక్యం చేసుకోం : నిర్మలా సీతారామన్

లోక్‌సభలో సహారా గ్రూప్, పిఎసిఎల్ లిమిటెడ్‌లో డిపాజిట్ చేసిన డబ్బు వాపసుకు సంబంధించిన అంశాన్ని ఎంపిలు ప్రస్తావించారు. దీనికి స్పందించిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో రీఫండ్‌లపై కేంద్రం చురుగ్గా పనిచేస్తోందని ఆమె తెలిపారు. కోర్టు సంబంధిత విషయాలపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదని సీతారామన్ పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా వాపసులో జాప్యం జరిగిందని ఎంపిలు సూచిస్తున్నారని విమర్శించారు. తమిళనాడు ఎంపి డి రవికుమార్ రాష్ట్రాలకు జిఎస్‌టి పరిహారం కొనసాగింపుపై ప్రశ్నించారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుత జిఎస్‌టి పరిహార సెస్, కోవిడ్-19 మహమ్మారి సమయంలో తీసుకున్న రుణాలను రాష్ట్రాలకు పరిహారంగా చెల్లించడానికి ఉపయోగించబడుతుందని వివరించారు. జిఎస్‌టి పరిహారం సెస్ అధికారికంగా జూన్ 2022లో ముగిసిందని, జిఎస్‌టి కౌన్సిల్ సమిష్టి నిర్ణయంతో దానిని మార్చి 2026 వరకు పొడిగించినట్లు తెలిపారు.

కుల గణనకు కేంద్రం సిద్ధంగా లేదు : కాంగ్రెస్

ఒబిసి క్రీమి లేయర్‌కు సంబంధించి లోక్‌సభలో తన వాయిదా తీర్మానం నోటీసును కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాకూర్ ఇచ్చారు. '2017 నుండి పెండింగ్‌లో ఉన్న ఒబిసి క్రిమిలేయర్ సమస్యపై వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. తాను ఒబిసి అని ప్రధాని మోడీ అంటారు. ఆయన ప్రభుత్వంలో 2017 నుంచి క్రిమిలేయర్ ఉంది. కానీ వారు పట్టించుకోలేదు. వారి ఉద్దేశం కేవలం ఒబిసి పేరుతో పబ్లిసిటీ చేసుకోవడమే. కుల గణన అనేది చాలా కీలకమైన అంశమని అందరికీ తెలుసు. ఇప్పుడు, ఈ ప్రభుత్వం జనాభా గణనతో పాటు కుల గణనను కూడా నిర్వహించడానికి పూర్తిగా సిద్ధంగా లేదు' అని అన్నారు.

పత్రికా స్వేచ్ఛలో ఇండియా స్థానం దారుణం : సిపిఎం ఎంపి శివదాసన్

ప్రతికా స్వేచ్ఛలో ఇండియా స్థానం చాలా దారుణంగా ఉందని సిపిఎం ఎంపి వి శివదాసన్ అన్నారు. రాజ్యసభలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో 180 దేశాల్లో 159వ స్థానంలో ఉన్న పరిస్థితిని ఆయన లేవనెత్తారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లను ఉటంకిస్తూ, పోలీసు కేసులు, అరెస్టులు, యుఎపిఎ వంటి చట్టాల ప్రకారం జైలుశిక్షలు కూడా ఉన్నాయన్నారు. జర్నలిస్టులు ప్రబీర్ పుర్కాయస్తా, సిద్దిక్ కప్పన్‌ల అరెస్టులను ఆయన ప్రస్తావించారు. గత దశాబ్ద కాలంలో దేశంలో ప్రముఖ ఎడిటర్ గౌరీ లంకేష్‌తో సహా 100 మందికి పైగా జర్నలిస్టులు హత్యకు గురయ్యారని శివదాసన్ ఎత్తి చూపారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారికి సరైన వేతనాలు అందజేయడంలో విఫలమైందని ఆగ్రహించారు.

222కు పెరిగిన మృతులు

మరో 206 మంది ఆచూకీ గల్లంతు

వయనాడ్‌లో ఏడు రోజూ కొనసాగిన గాలింపు, సహాయక కార్యక్రమాలు

గుర్తు తెలియని మృతదేహాలకు సామూహిక అంత్యక్రియలు



పిథుమల శ్మశాన వాటికలో గుర్తు తెలీని మృతదేహాలకు నిర్వహిస్తున్న సామూహిక అంత్యక్రియలు

తిరువనంతపురం : వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో 222 మంది మరణించినట్లు కేరళ ప్రభుత్వం సోమవారం అంచనా వేసింది. ఏడో రోజైన సోమవారం కూడా శిథిలాల కింద ప్రాణాలతో ఉన్న వారి కోసం, మృతదేహాల కోసం అన్వేషణ కొనసాగింది. మృతుల్లో 37 మంది చిన్నారులు, 88 మంది మహిళలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తంగా 172 మృతదేహాలను గుర్తించారు. చూరల్‌మల, ముండక్కై, అట్టమల ప్రాంతాల్లో బురదతో నిండిన శిథిలాల నుంచి 180 శరీర భాగాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. మృతదేహాలకు, శరీర భాగాలకు ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు, డిఎన్‌ఎ నమూనాలను సేకరించారు. ఇంకా 206 మంది ఆచూకీని గుర్తించలేకపోయారు. గాలింపు, సహాయక కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నందున మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన సోమవారం వయనాడ్‌లో గాలింపు, రెస్క్యూ, సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న క్యాబినెట్ సబ్‌కమిటీ ఆన్‌లైన్ సమావేశం జరిగింది.

రాడార్లు కలిగిన డ్రోన్లతో గాలింపు : మంత్రి శశీంద్రన్

అటవీ శాఖ మంత్రి ఎకె శశీంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ నిపుణులు గుర్తించిన నాలుగు ప్రాంతాల్లో భూమిలోకి చొచ్చుకునిపోయే రాడర్లు కలిగిన డ్రోన్లతో గాలింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చూరల్‌మల, ముండక్కైను కలిపే ఇరువన్హిపుజా నదిపై ఉన్న బెయిలీ వంతెనకు ఇరువైపులా దృష్టి కేంద్రీకరించినట్లు మంత్రి చెప్పారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలోకి సాధారణ పౌరులు ప్రవేశించడాన్ని కేరళ రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. సుమారు 1,500 మంది ప్రభుత్వ సిబ్బంది, దాదాపు ఇదే సంఖ్యలో ఉన్న వలంటీర్ల సహాయంతో సహాయక, గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతానికి వెలుపల 'రక్షిత జోన్'లో సంబంధిత అధికారుల ముందస్తు అనుమతితో బాధితులకు ఆహారాన్ని పంపిణీ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

సామూహిక అంత్యక్రియలు

గుర్తు తెలియని 31 మృతదేహాలకు, 158 శరీర భాగాలకు పిథుమల శ్మశాన వాటికలో వయనాడ్ జిల్లా యంత్రాంగం సామూహిక అంత్యక్రియలు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముందు అన్ని ప్రధాన విశ్వాసాలకు ప్రాతినిధ్యం వహించే విధంగా అయా మత పెద్దల చేత ప్రార్థనలు నిర్వహించారు.

బాధితులకు డాక్యుమెంట్ల కోసం త్వరలో ప్రక్రియ : మంత్రి రాజేష్

బాధితుల రక్షణ, పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబి రాజేష్ సోమవారం తెలిపారు. గల్లంతైన డాక్యుమెంట్లను బాధితులకు అందించేందుకు త్వరలో ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. ప్రమాదంలో 352 ఇళ్లు పూర్తిగా, 122 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. వైతిరి తాలూకాలోని కొత్తపాడి, వెల్లరిమల, త్రికేపేట గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం విపత్తు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించిందని, ఉపాధి హామీ పథకం ద్వారా 150 రోజుల ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు నిర్మాణ పరిమితిని 10 శాతం పెంచనున్నారు. మెటీరియల్ వర్క్ పరిమితిని కూడా 40 శాతం పెంచనున్నారు. ప్రమాదంలో గల్లంతైన వ్యక్తుల వివరాల సేకరణ వేగంగా జరుగుతోందని మంత్రి చెప్పారు.

అక్రమ తొలగింపులు, వేధింపులపై నిరసనాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలుగు విఒఎలు, యానిమేటర్లు, పెద్ద సంఖ్యలో తొలగింపునకు గురయ్యారని తెలిపారు. ఆశా, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లకు వేధింపులు అధికమయ్యామని అన్నారు. అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. 'ప్రభుత్వం మారింది కాబట్టి మా కార్యకర్తలను మీ స్థానంలో నియమిస్తామని, మీరు రాజీనామా చేయాలని కొందరు అధికార పార్టీ నాయకులు యానిమేటర్లపై పెద్ద ఎత్తున ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇప్పటికే బాపట్ల జిల్లాలో 90 మంది యానిమేటర్లను తొలగించారన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని మర్చిపోయారా? అని ఆమె ప్రశ్నించారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులను ఏకం చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విజయవాడ ధర్నా చౌక్ నిర్వహించిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలో 700 మంది విఒఎలలో 150 మందిని ఇప్పటికే తొలగించారని, మరో 150 మందిని తొలగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం భోజనం కార్మికులను వంద మందిని తొలగించారని వివరించారు. తొలగించిన, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని విధుల్లోకి వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు.



చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్కీమ్ వర్కర్లు

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఐటిడిఎ నుంచి కలెక్టరేట్ వరకు స్కీమ్ వర్కర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. రంపచోడవరంలో ఐటిడిఎ ఎదుట ధర్నా చేశారు. రాజమహేంద్రవరం, ఏలూరు కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులు భారీగా తరలివచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. అమలాపురం, కాకినాడ కలెక్టరేట్ల వద్ద ఎండలోనే స్కీమ్ వర్కర్లు బైఠాయించారు. శ్రీకాకుళంలో ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్‌పిలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట స్కీమ్ వర్కర్లు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఆర్‌టిసి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆక్కడ బైఠాయించారు. డిఆర్‌ఒను కలిసి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, పల్నాడు, కడప, రాయచోటి, ఒంగోలు కలెక్టరేట్ల, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ధర్నా చౌక్ వద్ద ధర్నా స్కీమ్ వర్కర్లు ధర్నా నిర్వహించారు.

ఘనంగా 'తంగలాన్' ప్రీ రిలీజ్ ఈవెంట్



చియాన్ విక్రమ్ హీరోగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి గ్రీన్ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మాత కెఇ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యధార్థ ఘటనల ఆధారంగా ఈసినిమా రూపొందించిచామని చిత్ర బృందం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని ప్రకటించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ఈ సినిమా విడుదలచేస్తోంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో డైలాగ్ రైటర్ రాకేందు మౌళి, హాలీవుడ్ నటుడు డేనియల్, హీరోయిన్ మాళవిక మోహనన్, నిర్మాత ఎస్‌కెఎన్, డైరెక్టర్ కరుణకుమార్, డైరెక్టర్ సాయి రాజేశ్, మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ నుంచి శశి, నిర్మాతలు ధనుంజయన్, దామోదరప్రసాద్, హీరోయిన్ పాయళ్‌రాజ్‌పుత్, దర్శక నిర్మాత మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్మాత జ్ఞానవేల్ రాజా, హీరో చియాన్ విజయ్ తదితరులు మాట్లాడారు. 'ఆగస్టు 15న వస్తున్న మా సినిమాను ప్రేక్షకులంతా ఆదరించాలని కోరుతున్నాం. మంచి కథతో 'తంగలాన్'ను తీశాం. మంచిహిట్ మూవీగా నిలుస్తుందనే నమ్మకం మాకుంది' అంటూ వివరించారు.

యాక్షన్ సన్నివేశాల్లో 'విశ్వంభర'

చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' సినిమా షూటింగ్ కొనసాగుతోంది. దర్శకుడు వశిష్ఠ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. త్రిష హీరోయిన్. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ నటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. కొరియోగ్రాఫర్ ఎ.అరసు నేతృత్వంలో క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోంది. 'చిరంజీవి చరిష్మాటిక్ ప్రెజెన్స్‌తో విశ్వంభర మునుపెన్నడూ లేని ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించటానికి రెడీ అవుతోంది. 'విశ్వంభర' క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ విజువల్ వండర్‌గా ఉండబోతోంది' అని చిత్ర యూనిట్ పేర్కొంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 10న విడుదల కానుంది.



మొక్క నాటండి.. టికెట్ పొందండి..

జగపతి బాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. సంపత్ నంది టీం వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంపత్ నంది, దాసరి రాజేందర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంపత్ నంది అందించిన ఈ కథకు మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆగస్ట్ 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ క్రమంలో ఇటీవల ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో మాట్లాడుతూ ప్రేక్షకులకు మంచి ఆఫర్ ఇచ్చారు. 'ప్రజలు ఎవరైనా తమ తమ ప్రాంతాల్లో మొక్కలు నాటి మాకు మెసేజ్ పెడితే టికెట్లు ఫ్రీగా ఇస్తాన'ని ఆఫర్ ఇచ్చాడు. అదే సమయంలో కార్యక్రమానికి అతిథిగా వచ్చిన మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ కూడా స్పందించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. నేను కూడా వారికి టికెట్లు అందజేస్తానని ప్రకటించారు.

సర్దార్-2లో ఆషికా



కార్తీ నటిస్తున్న సర్దార్ 2లో ఆషికా రంగనాథ్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మిషన్ కంబోడియా నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నారు. మాళవిక మోహనన్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. చెన్నైలో వేసిన భారీ సెట్‌లో ఈ చిత్ర షూటింగ్ జరుగుతోంది. కథానుగుణంగా కజకిస్తాన్, అజర్‌బైజాన్, జార్జియాలో ఈ సినిమా షూటింగ్ చిత్రీకరించేలా చిత్రబృందం ప్లాన్ చేసింది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు.



భారత పురుషుల హాకీ జట్టు ఒలింపిక్స్‌లో 44ఏళ్ల తర్వాత మరో పతకానికి చేరువైంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సెమీస్‌లో ఓడి కాంస్య పతక పోరులో జర్మనీపై 5-4గోల్స్ తేడాతో గెలిచింది. ఈసారి ఫైనల్లో బెర్త్‌కోసం సెమీస్‌లోనే జర్మనీతో తలపడనుంది. మంగళవారం జరిగే సెమీఫైనల్లో జర్మనీపై విజయం సాధిస్తే టోక్యో కన్నా మెరుగైన పతకం భారత్‌కు దక్కనుంది. దీంతో ఈ మ్యాచ్‌లో తప్పక విజయం సాధించాలని 144కోట్ల భారతీయులు కోరుకుంటున్నారు.

44ఏళ్ల హాకీ చరిత్రకు
అడుగు దూరంలో హర్మన్‌ప్రీత్ సేన

నేడు జర్మనీతో సెమీఫైనల్లో ఢీ • కాంస్య పతక పోరులో ఓడిన లక్ష్యసేన్, స్కీట్ జట్టు



పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో నేడు దృష్టి ప్రధానంగా హాకీపైనే నెలకొంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ పతకాన్ని ఖాయం చేసుకోనుండడమే ఇందుకు ప్రధాన కారణంగా. ఇక అమిత్ రోహిదాస్ బ్రిటన్‌తో మ్యాచ్ సందర్భంగా రెడ్‌కార్డుకు గురయ్యాడు. దీంతో అతడు లేకుండానే సెమీఫైనల్ మ్యాచ్ కూడా భారత్ ఆడాల్సిన పరిస్థితి నెలకొంది. అనుభవజ్ఞుడైన డిఫెండర్ అమిత్ సెమీస్‌లో జట్టుకు అందుబాటులో లేకపోవడం పెద్ద లోటే. అయితే.. క్వార్టర్స్‌లో రిఫరీ అమిత్‌కు రెడ్ కార్డ్ ఇచ్చాక పదిమందితోనే ఆడిన భారత జట్టు.. గోల్ కీపర్ శ్రీజేష్ ప్రతిభతో బ్రిటన్‌ను కంగుతినిపించింది. దీంతో 16మంది ఆటగాళ్లతో పారిస్‌కు చేరిన భారత హాకీజట్టుకు 15మంది ఆటగాళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో ఎవరెవరిని తుదిజట్టులో చోటు కల్పించాలనే అంశంపై హాకీ ఇండియా (హెచ్‌ఐ) నిమగ్నమై ఉంది. నెదర్లాండ్స్-స్పెయిన్ జట్ల మధ్య తొలి సెమీస్ పోరు జరగనుంది. ఈ మ్యాచ్ సాయంత్రం 5.30గం॥లకు జరగనుండగా.. భారత్-జర్మనీ మ్యాచ్ రాత్రి10.30గం॥లకు జరగనుంది.

హాకీ ఇండియా అప్పీల్ కొట్టివేత

ఒలింపిక్స్ సెమీఫైనల్‌కు ముందు భారత హాకీ జట్టుకు పెద్ద షాక్. స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్‌పై నిషేధాన్ని సవాల్ చేస్తూ హాకీ ఇండియా (హెచ్‌ఐ) చేసిన అప్పీల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్యకొట్టేసింది. 'ఆగస్టు 4న బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో రోహిదాస్ ఎఫ్ఐహెచ్ నియమ నిబ ంధలను ఉల్లంఘించాడని ఎఫ్ఐహెచ్ వెల్లడించింది.

క్వార్టర్స్‌లో ఓడిన నిషా దహియా

మహిళల రెజ్లింగ్ 68 కేజీల విభాగంలో నిషా దహియా క్వార్టర్ ఫైనల్లో ఓటమిపాలైంది. తొలుత 8-1పాయింట్లతో ఆధిక్యతలో నిలిచిన నిషా.. ఆ తర్వాత వరుసగా 9పాయింట్లు కోల్పోయి ఓడింది. చేయి, తలకు తీవ్ర గాయాలవ్వడంతోనే ఓటమిపాలైనట్లు నిషా ఆ తర్వాత పేర్కొంది. ప్రిక్వార్టర్స్‌లో నిషా 6-4తో టెటియానా సోవా రిజ్కో (ఉక్రెయిన్)పై విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరింది.

మహిళల టిటి క్వార్టర్స్‌కు భారత్..

మహిళల టేబుల్ టెన్నిస్ (టిటి) టీం క్వార్టర్‌ఫైనల్స్‌కు భార తజట్టు ప్రవేశం చింది. సోమవారం జరిగిన మహిళల టీం విభాగంలో భారత్ 3-2సెట్ల తేడాతో రొమేనియాపై సంచలన విజయం సాధించింది. మనిక బత్రా నేతృత్వంలోనే మహిళల టీం సోమవారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో అద్భుతం చేసింది. తొలి రెండు మ్యాచ్‌లు ముగిసే సరికి భారత్ 0-2తో వెనుకబడింది. ఆ తర్వాత శ్రీజ ఆకుల-అర్చన జంట 11-9, 12-10, 11-7తో, మనిక బత్ర 11-5, 11-7, 11-7తో గెలిచి 2-2తో స్కోర్‌ను సమం చేశారు. ఇక నిర్ణయాత్మక సింగిల్స్‌లో మనిక 11-5, 11-9, 11-9తో రొమేనియా ప్లేయర్‌ను చిత్తుచేసి చరిత్ర సృష్టించింది.

కాంస్య పతక పోరులో లక్ష్యసేన్ ఓటమి

బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ కాంస్య పతక పోరులో లక్ష్యసేన్ 21-13, 16-21, 11-21తో జియా లీ(మలేషియా) చేతిలో పోరాడి ఓడాడు. తొలి సెట్ ఆరంభంలో దూకుడుగా ఆడి 15-9తో భారీ ఆధిక్యంలో నిలిచాడు. రెండో గేమ్‌లో భారత షట్లర్ 8-5తో ఆధిపత్యం చెలాయించాడు. ఆ తర్వాత కుడిచేతికి గాయం కావడం లక్ష్యసేన్ ఆటపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. దీంతో ఆ సెట్ కోల్పోయాడు. మూడో సెట్‌లో లక్ష్యసేన్ మోచేతి నుంచి రక్తం కారుతుండడంతో ఒత్తిడికి గురైన భారత షట్లర్ 2-8తో వెనకబడ్డాడు. ఈ క్రమంలో పలుమార్లు లక్ష్యసేన్ గాయంతో ఇబ్బంది పడ్డాడు. దీన్ని అవకాశంగా తీసుకున్న జియా-లీ దూకుడుగా ఆడి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకు న్నాడు. దీంతో జియా-లీ(మలేషియా)కు కాంస్య పతకం దక్కింది. స్వర్ణ పతక పోరులో విక్టర్ అక్సెల్సన్(డెన్మార్క్) 21-11, 21-11తో విదిత్ శరణ్(థాయ్‌లాండ్)ను ఓడించాడు. రజత పతకం థాయ్‌లాండ్‌కు లభించింది.



ఒక్క పాయింట్‌తో..

స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో భారత షూటర్లు మహేశ్వరి చౌహాన్, అనంత్‌జిత్ సింగ్ ద్వయం 43-44 చైనా జోడి జియాంగ్, జియాన్లిన్ చేతిలో పరాజయాన్ని చవిచూసింది.



అందరి దృష్టి నీరజ్‌పైనే..

టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో సత్తాచాటిన నీరజ్ చోప్రా ఈ ఒలింపిక్స్‌లో తన తొలి ప్రదర్శనను మంగళవారం ప్రదర్శించనున్నాడు. మ.3.20నుంచి జావెలిన్ త్రో పోటీలు జరగనున్నాయి. గ్రూప్-ఎ, బి నుంచి మొత్తం 32మంది త్రోయర్లు పాల్గొనుండగా.. టాప్-8 నిలిచినవారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. టోక్యోలో నీరజ్ 88.07మీ. విసిరి బంగారు పతకం సాధించి చరిత్ర సృష్టించాడు.

మనూ భాకర్‌కు అరుదైన గౌరవం

ముగింపు వేడుక త్రివర్ణ పతాకధారిగా ఎంపిక



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో భారత పతాక ధారిగా రెండు కాంస్య పతకాలు నెగ్గిన మానూ భాకర్ వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ సంఘం(ఐఓఏ) ఎక్స్(ట్విటర్)లో వెల్లడించింది. షూటింగ్ వ్యక్తిగత 10మీ. ఎయిర్ పిస్టల్, 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో మను కాంస్య పతకాలు నెగ్గిన సంగతి తెలిసిందే. ఈ క్రీడల్లో అద్భుతంగా ప్రదర్శన ఇచ్చిన ఆమె త్రివర్ణ పతకాన్ని మోసేందుకు అర్హురాలని ఒలింపిక్ సంఘం అధికారి సోమవారం తెలిపారు. ఇది గొప్ప మర్యాదగా భావిస్తున్నానని మను పేర్కొంది.

ఇంగ్లండ్ మాజీ క్రికెటర్
గ్రాహమ్ థోర్ప్ కన్నుమూత



లండన్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్, మాజీ కోచ్ గ్రాహమ్ థోర్ప్ (55) కన్నుమూశారు. ఈ విషయాన్ని ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్‌బోర్డు సోమవారం ఎక్స్(ట్విటర్)లో వెల్లడించింది. ఆ ప్రకటనలో థోర్ప్ అనారోగ్య కారణాలతో కన్నుమూసినట్లు పేర్కొంది. "మాజీ క్రికెటర్ గ్రాహమ్ థోర్ప్ మతి షాక్‌కు గురి చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం " అని ఈసీబీ తెలిపింది. 1993 నుంచి 2005 వరకు ఇంగ్లండ్ తరపున 100 టెస్టులు ఆడిన థోర్ప్ 44.66సగటుతో 6,774 పరుగులు సాధించాడు. ఇందులో 16 సెంచరీలు ఉన్నాయి. 82 వన్డేల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 2002లో క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్‌పై ఏకైక డబుల్ సెంచరీ కొట్టాడు. 2005లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన థోర్ప్ తొలుత ఆస్ట్రేలియాకు కోచ్‌గా ఉన్నాడు. ఆ తర్వాత 2022లో ఆఫ్ఘనిస్థాన్‌కు కోచ్‌గా కొనసాగుతూ మధ్యలో అస్వస్థతకు గురై ఆ బాధ్యతలనుంచి వైదొలిగాడు.

పతకాల పట్టిక(టాప్-10)

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	21	17	14	52
2. అమెరికా	19	29	27	75
3. ఆస్ట్రేలియా	13	11	8	32
3. ఫ్రాన్స్	12	15	18	45
4. ద.కొరియా	11	8	7	26
5. బ్రిటన్	10	13	17	40
7. జపాన్	10	5	11	26
8. ఇటలీ	9	10	6	25
9. జర్మనీ	6	5	4	15
10. నెదర్లాండ్స్	6	5	4	15
59. ఇండియా	0	0	3	3

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం



చేతి వృత్తులు



చేతి వృత్తులు కనరండి.
పని చేసే వారిని చూడండి.
యంత్రములొచ్చి, తంత్రముగాను
వారిని దెబ్బ తీసినవి
ఆ గుర్తులు చెరిపేస్తున్నవి.

మట్టితొ చక్కని కుండలు చేసి
చల్లని నీటిని అందించి.
ప్రమిదలు చేసి దీపావళికి
పున్నమి శోభను చేకూర్చే
కుమ్మర వృత్తిని కన్నారా!
కుండలు చేయుట చూశారా!

మక్కువతోటి చెక్కలు తెచ్చి
చిత్రీ పట్టి, సాపుగ చేసి
మంచం, కుర్చీ, పీటలు చేసి
ఇంటికి గుమ్మం, కిటికీలిచ్చి
కమ్మరులను గమనించారా
వారి శ్రమను గుర్తించారా.

బంగారానికి, రాగిని కలిపి
అందాల ఆభరణం చేసి
అందరి మనస్సు దోచేసి
ఆ స్వర్ణ కారుని కలిశారా.
అతని ప్రతిభను విన్నారా.
పనితనం తెలుసుకున్నారా,

పత్తినితెచ్చి దారము వడికి,
నూలును చేసి, రంగులు పూసి
మగ్గము పైన నిరతము నేసి
రంగు రంగుల బట్టలు తెచ్చే
నేతగాళ్ల నైపుణ్యతను,
నాణ్యమైన ఆ బట్టలను.
కొన్నారా ఒక సారైనా .
వాడారా ఒక మారైనా .

చేతి వృత్తులకు చేయూతనిస్తే
నిరుద్యోగమే తగ్గునుగ
అందరికీ పని దొరుకునుగ
ఆకలి బాధలు తీరునుగ.


– కూచిమంచి నాగేంద్ర,
91821 27880.




తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఏడు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ






ఎస్. నవతేజ్,
2వ తరగతి,
నారాయణస్కూల్,
ఎస్ కోట,
విజయనగరం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



వయసు పెరుగుతున్న కొద్దీ ఎక్కడలేని నిరుత్సాహం చాలామందికి ఆవహిస్తుంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అయితే, ఎంత వీలైతే అంత త్వరగా విశ్రాంతి తీసుకుందామనుకునేవారే ఎక్కువ. కానీ జీవితమంతా కుటుంబబాధ్యతల్లో తలమునకలై, తీరిక లేకుండా గడిపిన కొంతమంది, అరవై తరువాత తమ అభిరుచులను, ఆసక్తులను తిరిగి పునరుజ్జీవింప జేసుకుంటున్నారు. వారు ఎంచుకున్న రంగంలో సాదాసీదాగా కాదు, ఉత్తమ ప్రతిభతో రాణిస్తున్నారు. అందుకే అటువంటి వారందరికీ అరవై.. ముగింపు కాదు.. ఆరంభం..

భగవానీ దేవీ దగ్గర్ (౯౬)



చిన్నప్పుడు ఎప్పుడో స్నేహితులతో కబడ్డీ ఆడుకున్న భగవానీ బామ్మకి 12 ఏళ్లకే పెళ్లి చేసేశారు. పిల్లలు, బాధ్యతల్లో తలమునకలైంది. ఇద్దరు బిడ్డలు, భర్త చనిపోయారు. మనవళ్లే మిగిలారు. వాళ్లని చూసుకుంటూ కాలం వెల్లదీస్తోంది. మనవళ్లిద్దరూ పెరిగి పెద్దయ్యారు. బామ్మగారికి 94 ఏళ్లు వచ్చాయి. ఈ వయసులో బామ్మలో దాగున్న క్రీడాస్ఫూర్తిని మనవళ్లు కనిపెట్టారు. తమ కోసం జీవితాన్ని త్యాగం చేసిన బామ్మని సంతోషపెట్టాలనుకుని ఓ షాట్‌పుట్ బాల్‌ని కొనిచ్చారు. అందులో శిక్షణ ఇప్పించారు. అంతే.. ఇన్నాళ్లు తనలో దాచుకున్న ప్రతిభను బామ్మ చూపించారు. 2022లో జరిగిన ఢిల్లీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించింది. ఆ తరువాత కూడా పోలాండ్‌లో జరిగిన 9వ ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్ ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడి బంగారు పతకాలు సాధించింది. అక్కడితో ఆగలేదు. 60 మీటర్ల పరుగుపందెంలో కూడా సత్తా చాటింది. అంతేకాదు, 'నేను జీవించి ఉన్నంత కాలం ఆడుతూనే ఉంటా' అని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ చెబుతోంది.

మలి దశలో మహాకార్యాలు

'పశ్చాత్తాపం లేకుండా జీవితాన్ని గడపడం' అంటే ఏంటి? అని ప్రతి ఒక్కరూ ప్రశ్న వేసుకోవాలి. ఎందుకంటే మనందరికీ కలలు, వాటిని సాధించాలనే ఆశ ఉంటుంది. కానీ చాలాసార్లు పరిస్థితులు, కుటుంబం, ఆర్థికపరిస్థితుల కారణంగా చాలా విషయాలకు రాజీ పడతాం. కానీ, కొంతమంది సమాజం, కుటుంబం, బాధ్యతల నుండి ఏ కాస్త విరామం దొరికినా ఆ సమయాన్ని వృధా చేసుకోరు. ఆ విలువైన సమయంలో రెండో జీవితాన్ని మొదలుపెడతారు. అలా తమని తాము పునర్నిర్వచించుకుంటున్న కొంతమంది గురించి తెలుసుకుందాం.



రామనాథన్ స్వామినాథన్ (79)

ప్రముఖ ఇంజినీర్‌గా జీవితాన్ని మొదలుపెట్టిన రామనాథన్ ఇస్రోకి మినీ రాకెట్ మోడళ్లని తయారుచేసేవారు. 2018లో రామ్‌నాథన్ తయారుచేసిన అతి చిన్న ఇత్తడి రాకెట్, స్పేస్ ఆర్గనైజేషన్ వాళ్లనే ఆకర్షించిందంటే ఆయన ప్రతిభ ఎంతటితో అర్థం చేసుకోవచ్చు. అప్పటి నుండి రామ్‌నాథన్ రకరకాల సైజుల్లో రాకెట్లను తయారుచేస్తూనే ఉన్నారు. 74 ఏళ్లప్పుడు కూడా ఇస్రో కోసం రాకెట్లు తయారుచేసిన ఈ పెద్దాయన ఇప్పటికి వంద మోడళ్ల వరకు అందించారు. '80 వస్తున్నా నాకేమీ అలసట లేదు. పనిలో ఎంతో ఉత్సాహంగా ఉంటాను. ప్రతి రోజూ కొత్తగా ఉంటుంది. 365 రోజులూ నూతన ఆవిష్కరణలు చేయడం నాకిష్టం' అంటున్నారు రామనాథన్.



పద్మా పారిఖ్ (89)

89 ఏళ్ల ఈ బామ్మ హ్యాండీక్రాఫ్ట్ బిజినెస్‌లో కుర్ర వ్యాపారులకు దీటుగా దూసుకుపోతోంది. ఈ బామ్మ తయారుచేసిన ఉత్పత్తులకు విదేశాల నుండి కూడా గిరాకీ వస్తోంది. వృధాగా పారవేసిన పాత బట్టలతో అందమైన పక్షులు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కీ చైన్లు, చెవిదిద్దులు, పర్సులు, ఇలా రకరకాల వస్తువులు తయారుచేస్తుంది. 'రోజుకు మూడు గంటలు కష్టపడతాను. కంటి చూపు దెబ్బతింది. అయినా విశ్రాంతి తీసుకోవాలని అనుకోను. ఈ రోజుల్లో చిన్న వయసులో విరామం తీసుకోవాలని చాలామంది అనుకుంటున్నారు. నేను ఈ వయసులో కూడా పని చేసి, వారిలో స్ఫూర్తినింపాలి. ఇదే నా లక్ష్యం' అంటున్నారు పద్మ బామ్మ.

ఎన్ థంకమ్మ (90)



కేరళకి చెందిన విశ్రాంత టీచరమ్మ అయిన థంకమ్మ, తన లాంటి వృద్ధులందరికీ చేయూతగా నిలబడ్డారు. తాతముత్తాతల నుండి సంక్రమించిన ఇంటిని డేకేర్ సెంటర్‌గా మార్చేశారు. ఉదయం 8 గంటలకి వివిధ ప్రాంతాల నుండి ఇక్కడకి ఎందరో బామ్మలు వచ్చేస్తారు. వారందరినీ స్వయంగా వారి పిల్లలే ఇక్కడ వదులుతుంటారు. అలా వచ్చిన బామ్మలంతా రోజంతా సరదాగా గడిపేలా చూడడం థంకమ్మ దినచర్య. ఈ డేకేర్‌లో రోజుకు 30 మంది వచ్చి ఆశ్రయం పొందుతారు. సరదా కాలక్షేపాలు, ఆటలు, పాటలు, తోటపని, వంటపని, యోగా, చదువు, వ్యవసాయం ఇలా ఎవరికి తోచిన పనిలో వారు బిజీగా ఉంటారు. 'రోజంతా వీరిని సంతోషంగా ఉంచడమే నా లక్ష్యం. ఈ సమాజానికి నా వంతుగా ఏదైన చేయాలని అనుకున్నప్పుడు నాకు ఇంతకంటే మంచి ఆలోచన రాలేదు. ఈ వసతిగృహం నిర్వహణలో కొంతమంది యువతీయువకులు కూడా నాకు సాయంగా నిలబడతారు. నాకు కావాల్సింది కూడా ఇదే. నా తరువాత వారసత్వాన్ని వారు కొనసాగిస్తే నా లక్ష్యం నెరవేరినట్లే' అంటారు థంకమ్మ.



వీణా మల్హోత్రా (66), నాగమణి (90)

ఈ ఇద్దరు బామ్మలు తాము ఎదుర్కొన్న సమస్యల నుండే కొత్త రంగంలోకి అడుగుపెట్టారు. జుట్టు రాలే సమస్యను అధిగమించడం కోసం వీణా బామ్మ ఏకంగా 'వీణా జీ ఆయిల్' పేరుతో ఓ బ్రాండ్ ఆయిల్‌నే తయారుచేసేస్తున్నారు. నాగమణి బామ్మ మరో అడుగు ముందుకేసి 150 ఏళ్ల క్రితం నాటి హెయిర్ ఆయిల్‌ని తయారుచేస్తూ తన స్నేహితులకు, బంధువులకు పంపిణీ చేస్తున్నారు.



ఫైలో థామస్ (67),
స్మితా సురేంద్రనాథ్ బ్లాగన్ (64)

ఈ ఇద్దరు బామ్మలు, వేర్వేరు ప్రాంతాల వారైనా ఎంచుకున్న రంగం ఒక్కటే. పాకశాస్త్రంలో ఇద్దరూ అందెవేసిన చేయి. భర్త నుండి సంక్రమించిన పచ్చళ్ల వ్యాపారంలో ఫైలో దూసుకుపోతున్నారు. 'జీవితమంతా బాధ్యతల్లోనే ఉంటున్నాం. 60 దాటిన దగ్గర నుండి విసుగు, అలసట, ఏమీ చేయలేం' అనే నిరాసక్తత మనల్ని ఆవరిస్తుంది. కానీ అప్పుడే మీ, మీ నైపుణ్యాలపై దృష్టి పెట్టండి. నేను ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టాకే నాపై ఒత్తిడి, ఆందోళన తగ్గాయి. పైగా నాకు అపారమైన గుర్తింపు వస్తోంది. ప్రేమ ఇస్తున్నారు' అంటూ ఎంతో సంతోషంగా ఫైలో చెబుతున్నారు. ఇక స్మిత అయితే ఏకంగా ఓ రెస్టారెంట్‌నే నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రలో పుట్టి, కర్నాటక అత్తింట్లో అడుగుపెట్టిన ఈ పంజాబీ బామ్మ ప్రస్తుతం గోవాలో సెటిల్ అయ్యారు. ప్రభుత్వ ఉద్యోగి భార్యగా దేశంలో పలు ప్రాంతాలతో ఏర్పడ్డ పరిచయం, స్వతహాగా వంటపై ఉన్న ఆసక్తి, బామ్మకి ఆయా వంటల్లో మంచి నైపుణ్యం తెచ్చిపెట్టింది. ఇంకేముంది, సముద్రం ఒడ్డున మంచి మంచి మసాలాలతో మాంసాహారం వండేస్తూ తెగ ఫేమస్ అయిపోయింది. 'ఈ వయసులో రెస్టారెంట్ నడపడం అంత ఈజీ కాదు' అని ఎవరైనా అంటే, 'మసాలా, డ్రామ లేకుండా జీవితం ఎలా నడుస్తుంది' అని నవ్వేస్తుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68